www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 73 మంగళవారం, జూలై 28, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం


2లో

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

## - మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

- ●గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- ●బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- ●బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- ●విపక్ష సభ్యుల ఆందోళనతో సభను



**న్యూఢిల్లీ,జులై 27 :** పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా వి పక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ




## కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,జులై 27 :** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమ వారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మిగతా2లో...

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

- ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి


2లో

## ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం


2లో

## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం - అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,జులై 27 :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు మిగతా2లో...

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



**హైదరాబాద్,జులై 27 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి మిగతా2లో...



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**హైదరాబాద్,జులై 27 :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

### కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



**న్యూఢిల్లీ,జులై 27 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మిగతా2లో...

## ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్



**హైదరాబాద్,27 :** మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిదునాక్స్మికంగా సందర్శించారు. సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు మిగతా2లో...

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ

# ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్



**హైదరాబాద్,జులై 27:** సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్ ఇచ్చింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 14, 16 అధికరణాలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది.గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

**న్యూఢిల్లీ,జులై 27 :**నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది.ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

**అమరావతి,జులై 27 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించ నున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ్గ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తు న్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చే లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీ యం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ్గ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతి స్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

# ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**హైదరాబాద్,జులై 27 :** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు.

# ఆర్థిక భరోసా కలిగిస్తూ ఔన్నత్యాన్ని చాటుకున్న ఉపాధ్యాయులు

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 27(పీపుల్స్ న్యూస్)**

వెంకటాపూర్ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా, ఒకరికొకరు అండగా నిలబడటం, మానవతా విలువలను పాటించడం కూడా ఉపాధ్యాయుల గొప్ప లక్షణం. ఇటీవల మరణించిన తమ సహ ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందించి, తోటి ఉపాధ్యాయులు తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు జయప్రద మరియు మహమ్మద్ ఇటీవల అనారోగ్య కారణం చేత మరణించగా వారిరువురి కుటుంబాలకు ఆర్థికపరమైన సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనం. ఈ విషయాన్ని గుర్తించిన తోటి ఉపాధ్యాయులు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. కొందరు తమ జీతం నుంచి సహాయం చేయగా, మరికొందరు సమిష్టిగా నిధులు సమకూర్చి సహకరించారు. ఈ సహాయం ఆర్థికంగా మాత్రమే కాకుండా, ఆపదలో ఉన్న సహ ఉపాధ్యాయుల కుటుంబాలకు ధైర్యాన్ని కూడా అందించి మేమంతా మీకు అండగా ఉన్నాం అనే భావనను కలిగించింది. ఉపాధ్యాయుల మధ్య ఉన్న ఐక్యత, పరస్పర సహకారం, సోదరభావం ఈ సంఘటన ద్వారా స్పష్టమయ్యాయి. తమ సహచరుల కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించిన ఉపాధ్యాయులు నిజమైన మానవతావాదులు. వారి సేవాభావం



ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. సమాజంలో పరస్పర సహకారం, దాతృత్వం, మానవత్వం ఎంత ముఖ్యమో వారు తమ ఆచరణ ద్వారా తెలియజేశారు. ఆపదలో ఉన్న సహ ఉపాధ్యాయుల కుటుంబాల్లో ఆర్థిక సహాయం అందించిన ఉపాధ్యాయులు తమ స్ఫూర్తిని నింపి, మనుషుల మధ్య ప్రేమాభిమానాలను మరింత పెంచుతున్నారు. గతంలో అదే శాఖలో పనిచేసే ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు మరణించగా స్పందించిన ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని గర్ల్స్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జయప్రద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు అంతేగాక వెళ్తుర్లపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు మహమూద్ ఇటీవల మరణించగా ఆదివారం రోజున వారి కుటుంబ సభ్యులను కలిసి తమ వంతు సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తాళ్లపల్లి ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు సల్లగొండ పద్మాకర్ రెడ్డి, సర్వర్ అహ్మద్, జనగాం బాబురావు, కోకిల శ్రీరంగం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి రాధిక, బి సురేష్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి లక్ష్మారెడ్డి, కే భాగ్యలక్ష్మి, ఎల్ ఎఫ్ ఎల్ హెడ్మాస్టర్స్ నల్ల రాజిరెడ్డి, సూత్రాల రవి, ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు టి ఓదెలు, ఆడిచర్ల రాజయ్య, బి కమలాకర్, లకావత్ శ్రీనివాస్, ఎస్ సతీష్, వి రాజేంద్రము, ఎన్ శ్యాం ప్రసాద్, ఎండీ లియాకత్ అలీ, పి రమేష్, చెన్నకేశవరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి:

## - నల్లగొండ షీ టీం ఎస్ఐ ఎండి గౌస్:



**చిట్యాల, జులై 27 :**

విద్యార్థులకు చిన్నతనం నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నల్గొండ షీ టీం ఎస్ఐ ఎండి గౌస్ అన్నారు.నల్గొండ జిల్లా ?చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ షీ టీం ఎస్సై ఎం.డి. ఘౌస్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఈవ్‌టీజింగ్ మరియు మహిళలపై వేధింపులు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో స్నేహాలు చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని చెప్పారు. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు పిలుపునిచ్చారు. నల్గొండ జాగృతి కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా సైబర్ నేరాలు, బాలల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.?మండల విద్యాధికారి పానుగోత్ సైదానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల గ్రామాల బస్తీల ఎమ్మార్పీఎస్ మరియు ఎం ఎస్ పి కమిటీల నిర్మాణానికి సిద్ధం కండి.

**వంగూరి ఆనందరావు మాదిగ వరంగల్ జిల్లా ఇంచార్జ్**

**వరంగల్ /ఖమ్మం/జులై27/(పీపుల్స్ న్యూస్ )**

వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల మరియు గ్రామాల ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి బస్తీల కమిటీల నిర్మాణానికి సిద్ధం కావాలని జిల్లా ఇన్చార్జి వంగూరు ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు నేడు జిల్లా కేంద్రంలో లక్ష్యం పురం కమ్యూనిటీ హాల్లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మండల కమిటీల మరియు గ్రామ బస్తి కమిటీల నిర్మాణంలో గతంలో గోటు విలేజ్ కార్యక్రమాల్లో భాగంగా నియమించబడ్డ మండల ఇన్చార్జీలు యధావిధిగా కొనసాగుతారని ఆ మండలాల బాధ్యతల్లో నియమించబడ్డ ఇన్చార్జిలు ఎవరైతే ఉన్నారో వారు వారి వారి మండలాల్లో పూర్తిస్థాయిలో గ్రామ కమిటీలు నిర్మాణం చేసి మండల కమిటీలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు పద్మశ్రీ అవార్డు గ్రహీత సామాజిక ఉద్యమాల రథసారథి మహాజననేత మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు జరుగుతున్న ఈ నిర్మాణాల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు ప్రస్తుతం గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అన్ని కమిటీలు రద్దయిన తరుణంలో గతంలో ఎవరైతే గ్రామ మండల జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయి నాయకులు గా బాధ్యతల్లో ఉన్నారో వారే మరల పూర్తిస్థాయిలో నిర్మాణ కమిటీల ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలని ఆయన కోరినారు ఈ జిల్లా సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ రాష్ట్ర జిల్లా మండల నాయకులు కట్ల రాజశేఖర్ మాదిగ మాసాని గోపాల్ మాదిగ గంగారపు మల్లన్న మాదిగ జిల్ల ధర్మయ్య మాదిగ కన్నెబోయిన ప్రమోద్ మాదిగ కన్నూర్ చంద్రశేఖర్ మాదిగ దామెర కిషోర్ మాదిగ కోదూరు రాజు మాదిగ పరికరత్నం మాదిగ ముత్యాల మల్లేష్ మాదిగ చాడ కరుణాకర్ మాదిగ చిన్న పల్లి రాజు మాదిగ ఇసంపల్లి రాజు మాదిగ





చంద్రమౌళి మాదిగ సుందరం మాదిగ మారపాక బాబు మాదిగ పరుశురాం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి:మోదీ రాందేవ్



**చిట్యాల జులై 27**


తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10,000 కోట్లను తక్షణమే విడుదల చేయాలని మరియు జీవో నెంబర్ 9 ఆర్‌ఆర్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలో విద్యార్థులతో భారీ మహాధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ?ధర్నా సమయంలో విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కొందరు విద్యార్థులు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ?ఫీజు బకాయిలు పడటంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రూ. 5 లక్షల 'విద్యార్థి భరోసా కార్డు'ను వెంటనే అమలు చేయాలని అన్నారు ?ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్, బీజేపీ నాయకులు పల్లపు దుర్గయ్య, బిఆర్ఎస్ నాయకులు సురేష్, అఖిలపక్ష విద్యార్థి,బీసీసంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏ. పి. జె. అబ్దుల్ కలాం (జూలై 27) 11 వ వర్ధంతి సందర్భంగా...

## ● ఉత్తమ సామాజిక సేవ జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు.

**ఖమ్మం /జులై 27/(పీపుల్స్ న్యూస్ )**

భారతదేశాన్ని ప్రపంచ రక్షణ రంగంలో స్వావలంబన వైపు నడిపించిన మహాశాస్త్రవేత్తగా కలాం చరిత్రలో నిలిచిపోయారు. దేశీయ క్షిపణి సాంకేతికతకు ఆయన అందించిన నాయకత్వం ప్రొఫెసర్ ఏపీజే అబ్దుల్ కలాంకు 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనే గౌరవ బిరుదు లభించింది. భారత సమీకృత మార్గదర్శక క్షిపణి అభివృద్ధి కార్యక్రమానికి సారథ్యం వహించి పృథ్వీ, అగ్ని, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి స్వదేశీ క్షిపణుల అభివృద్ధికి మార్గనిర్దేశం చేశారు. ఈ విజయాలు భారత రక్షణ సామర్థ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో పనిచేసిన రోజుల్లో దేశ తొలి స్వదేశీ ఉపగ్రహ వాహక నౌక ఎస్‌ఎల్వీ-3 అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. 1980లో రోహిణి ఉపగ్రహాన్ని విజయవంతంగా భూకక్ష్యలో ప్రవేశపెట్టడం భారత అంతరిక్ష చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలో శాస్త్రవేత్తగా, సలహాదారుగా పనిచేస్తూ భారత రక్షణరంగ సాంకేతిక స్వావలంబనను అందించారు. 1998లో జరిగిన పోఖ్రాన్-×× అణు పరీక్షల విజయవంతమైన నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆ విజయంతో భారతదేశం ప్రపంచానికి తన వ్యూహాత్మక శక్తిని చాటిచెప్పింది. శాస్త్రవేత్తగా ఆయన కృషి భారత భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, యువతలో విజ్ఞానశాస్త్రంపై అపార ఆసక్తిని కలిగించింది. 1998లో కలాం-రాజు స్టెంట్, కలాం-రాజు టాబ్లెట్ వంటి తక్కువ ఖర్చుతో కూడిన వైద్య పరికరాల అభివృద్ధికి తోడ్పడ్డారు. ఇండియా



2020, వింగ్స్ ఆఫ్ ఫైర్, ఇగ్నైటెడ్ మైండ్స్, మిషన్ ఇండియా, ట్రాన్సెండెన్స్ వంటి పుస్తకాల ద్వారా యువతకు స్ఫూర్తినిచ్చారు. ఆయన ప్రసిద్ధ సందేశం: 'కలలు కనండి... ఆ కలలే ఆలోచనలుగా మారి, ఆలోచనలు కార్య రూపం దాలుస్తాయి.' రాష్ట్రపతి పదవిలో ఉన్నప్పటికీ ప్రతి పర్యటనలో విద్యార్థులతో సమావేశమవడాన్ని తప్పనిసరిగా భావించేవారు. 'యువతే భారత భవిష్యత్తు' అనే నమ్మకంతో జీవితాంతం విద్యార్థులను ప్రేరేపించారు. ప్రజల రాష్ట్రపతి గా చిరస్థాయిగా గుర్తింపు పొందారు. 2015 జూలై 27న, మేఘాలయలోని షిల్లాంగ్ వేదికపై విద్యార్థులకు 'నివసించదగిన భూమి' గురించి ఉపన్యాసం చేస్తూనే ఆయన కుప్పకూలిపోయారు. బోధిస్తూ జీవితాన్ని ముగించిన అరుదైన ఉపాధ్యాయుడిగా చరిత్రలో నిలిచిపోయారు. భౌతికంగా దూరమైనా, ప్రతి భారతీయ యువకుడి కలలో, ప్రతి శాస్త్రవేత్త సంకల్పంలో, ప్రతి విద్యార్థి ఆశయంలో కలాం చిరంజీవిగానే ఉంటారు. భారతదేశానికి క్షిపణి శక్తినిచ్చిన 'మిసైల్ మ్యాన్', యువతకు ఆత్మవిశ్వాసాన్ని నూరిపోసిన 'పీపుల్స్ ప్రెసిడెంట్', భావితరాలకు నిత్యస్ఫూర్తిగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం శాశ్వతంగా నిలిచిపోతారు.

# 32వ డివిజన్లో పర్యటించిన మేయర్



**రామగుండం,జులై 27**

ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన భాధ్యత ఎన్ టి పి సి సంస్థపై ఉందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా సోమవారం 32 వ డివిజన్ అన్నపూర్ణ కాలనీ లో స్థానిక కార్పొరేటర్ తోట మమత కుమార్ తో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కాలువల్లో పూడిక తొలగింపు, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనులను ఆయన పర్యవేక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ టి పి సి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన సిఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలించుకొని వెళుతుంటే నాటి పాలకులు పట్టించుకొకపోవడంతో నిధుల్లేక కనీస మౌళిక వసతులు కూడా డివిజన్ లో కరువయ్యాయని,ఎంఎల్ఎ గా రాజ్ ఠాకూర్ ఎన్నికైన తరువాతనే ఎన్ టి పీ సి,సిఎస్ఆర్ నిధులు ప్రక్క దారి పట్టకుండా స్థానికంగా వెచ్చించడం జరుగుతుందని తెలిపారు.డివిజన్ లో అనేక సమస్యలు నెలకొన్నాయని వార్డు సందర్శనలో గమనించి నమోదు చేసుకోవడం జరిగిందని,త్వరలోనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పరిశుభ్రంగా,సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని పేర్కొన్నారు.వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్త బయట వేయకుండా స్వచ్ఛ ఆటోకు అప్పగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్,టిపిఓ నవీన్,ఎఇ తేజస్విని,ఆర్ఐ ఖాజా,జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి,మెప్మా సిఓ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## రహదారి కి ఇరువైపులా సర్కారి తుమ్మ పొదలు తొలగింపు

-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



**ఖమ్మం జిల్లా ,జూలై 27 (పీపుల్స్ న్యూస్) :** , రఘునాధపాలెం, ఇర్లపూడి గ్రామం నుండి బద్యా తండా గ్రామం వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా సర్కారీ తుమ్మ పొదలు దట్టంగా అల్లుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న తరుణంలో ప్రయాణికులకు , వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బద్య తండ గ్రామం ఉప సర్పంచ్ నునావత్ రవి ఆ అడ్డుగా ఉన్న కంచెలను నరికించి రహదారిని శుభ్రం చేయించారు. దీనివల్ల ప్రయాణం మరింత సురక్షితంగా మారడమే కాకుండా, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించి ప్రమాదాలు జరిగే అవకాశం తగ్గుతుందని రవి తెలిపారు .ఈ పని పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు..

## యువత మారితేనే దేశ భవిష్యత్తు మారుతుంది

- గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి
- విద్యార్థి--యువజన ఉద్యమాలే సమాజానికి మార్గదర్శకం: ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి
- వైభవంగా ఏఐవైఎఫ్ 22వ నేలకొండపల్లి మండల మహాసభలు -- నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక






**ఖమ్మం /నేలకొండపల్లి/జులై 27/(పీపుల్స్ న్యూస్ )**
నేటి యువత దేశ భవిష్యత్తుకు పునాది అని, యువత సరైన దిశలో నడిస్తేనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని ఏఐవైఎఫ్ (ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని అన్యాయాలపై ప్రశ్నించే చైతన్యవంతులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు.ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో పాలపాటి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఏఐవైఎఫ్ 22వ మండల మహాసభల్లో ఆయన మాట్లాడారు....యువత నేడు మత్తు పదార్థాల వ్యసనాల బారిన పడటం ఆందోళనకరమని, ఉపాధి అవకాశాల కొరత, సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొందరు యువకులు నేరాల వైపు మళ్లుతున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంజాయి, డ్రగ్స్ వ్యాపారం విస్తరిస్తోందని, దీనిని అరికట్టేందుకు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి యువకుడు తన జీవితాన్ని, కుటుంబాన్ని కాపాడుకోవాలంటే ఈ వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.చదువుకున్న యువతకు తగిన ఉద్యోగాలు లేకపోవడం, ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవడం, నిర్వహించిన పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకోవడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల ముందు తలవంచడం కంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడటం ద్వారానే హక్కులు సాధించవచ్చని స్పష్టం చేశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చాయని, ఆ పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే రాజీనామాతో సమస్యలు ముగిసిపోవని, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.వరుస పరీక్షా అక్రమాలకు కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ--2020)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో గాయపడిన విద్యార్థులకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, పేపర్ లీకేజీలు, ఆందోళనల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ నేలకొండపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలపాటి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, ఆలేటి ఉమామహేష్ అధ్యక్షుడిగా, పెదపాక నాగరాజు సహాయ కార్యదర్శిగా, గోపినాథ్ ఉపాధ్యక్షుడిగా, మరో 19 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన బాధ్యులు మాట్లాడుతూ, మండలంలో గంజాయి, డ్రగ్స్ వంటి సామాజిక రుగ్మతలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి మరింత ఉత్సాహంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్, మల్లెబోయిన ఉపేందర్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, భద్రాజీ వెంకటేశ్వరరావుతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## దివ్యాంగుడైన రాహుల్ కోరికను నెరవేర్చిన సీపీ సుమతి బడుగుల

- తన కల సాకారమైన ఆనందంలో రాహుల్ ముఖంలో వెల్లివిరిసిన చిరునవ్వు





**మల్కాజ్గిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 27 (పీపుల్స్ న్యూస్) :**
పుట్టుకతోనే దివ్యాంగుడైన రాహుల్‌కు పోలీస్ అధికారి కావాలన్నది చిరకాల కోరిక. ఒక్కరోజైనా పోలీస్ అధికారి కుర్చీలో కూర్చోవాలన్న అతని ఆకాంక్షను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల నెరవేర్చారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో రాహుల్‌ను తన కుర్చీలో కూర్చోబెట్టి, పోలీస్ క్యాప్ ధరింపజేసి ఆప్యాయంగా పలకరించారు. తన కల సాకారమైన ఆనందంలో రాహుల్ ముఖంలో వెల్లివిరిసిన చిరునవ్వు అందరినీ ఆకట్టుకుంది. విధి నిర్వహణలో కర్తవ్యం... సమాజం పట్ల మానవత్వం... మల్కాజిగిరి పోలీసుల నిబద్ధత అని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు

## నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి పరిశీలించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ఖమ్మం/జూలై 27/(పీపుల్స్ న్యూస్ )**
నగరంలో అమృత్ 2.0 పథకం ద్వారా 100 కోట్ల నిధులతో నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల పురోగతి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా, చెరువులు మురుగు నీటితో కలుషితం కాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖానాపురం చెరువు ఎగువనుండి దంసలాపురం చెరువు వరకు ఉన్న అన్ని మునిసిపల్ డ్రైన్ల ద్వారా వచ్చే మురుగు నీరు వరద కాలువ ద్వారా చెరువులను చేరి కలుషితం చేయడంతో ధాంసాలాపురం చెరువులో చేపలు చనిపోతున్నాయి. అన్ని మురుగు నీటి డ్రెయిన్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తో అనుసంధానం చేసి మురుగు నీటి శుద్ధి కేంద్రానికి తరలించి శుద్ధి చేస్తారు. శుద్ధి చేసిన నీరు పునర్వినియోగం చేయగా మిగిలిన నీరు చెరువులోకి చేరుతుంది. గడిచిన సంవత్సరాలలో ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తగా అనేక డివిజన్లు ముంపుకు గురయ్యాయని మంత్రి అన్నారు. నగరంలో వర్షాల వరద నీటిని తరలించేందుకు 250 కోట్లతో వరద నీటి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వాకర్స్ కి ఆరోగ్యం మరియు ఆహ్లాదకరంగా ఉండేందుకు రెండు లకారం చెరువుల మధ్యలో నాలా సుందరీకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, పబ్లిక్ హెల్త్ డిఈ నవీన్ కుమార్, ఏఈలు , నవ్యజ్యోతి, దివ్య మరియు అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోంది..

పదేపదే కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న హైడ్ర) కమిషనర్‌గా రంగనాథ్)ను తొలగించాలని హైకోర్టు సంచలన ఆదేశాలు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని.. ఆయనను వెంటనే తప్పించాలని చీఫ్ సెక్రటరీని అత్యున్నత ధర్మాసనం ఆదేశించడంపై రంగనాథ్ స్పందించారు. హైడ్రా కమిషనర్‌గా వందల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడానని ఆయన పేర్కొన్నారు.
హైకోర్టు వ్యాఖ్యలపై స్పదించిన రంగనాథ్.. హైడ్రా కమిషనర్‌గా తాను వందల ఎకరాల ప్రభుత్వ భూములను ధైర్యంగా కాపాడానని రంగనాథ్ తెలిపారు. తన నేతృత్వంలో ఇప్పటివరకూ రూ.1.50లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడామని, ఆరు చెరువులను పునరుద్ధరించామని ఆయన చెప్పారు. అయితే.. ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని రంగనాథ్ ఆరోపించారు.తాజాగా వివాదానికి కేంద్రమైన లోతుకుంట భూమిని శాంతా శ్రీరామ్ అనే స్థిరాస్థి సంస్థ కొట్టేయాలని చూసిందని, ఆ భూమి విలువ సుమారు రూ.10 వేల కోట్లు ఉంటుందని రంగనాథ్ పేర్కొన్నారు. ఆ సంస్థ వాళ్లు అనుమతి లేకుండా హెరిటేజ్ గుట్టలను ధ్వంసం చేస్తున్నారని, పలు సంఖ్యలో చెట్లను నిర్ధాక్షిణ్యంగా నరికేశారని ఆయన తెలిపారు. సేవ్ ది రాక్స్, పర్యావరణ సొసైటీ ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగిందని పేర్కొన్న రంగనాథ్ తనపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు కబ్జాకోరులు వేసినవేనని స్పష్టం చేశారు. అంతేకాదు తనకు న్యాయస్థానాలు, చట్టాలపై పూర్తి గౌరవం, నమ్మకం ఉందని, తనను తొలగించాలని హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై చట్టపరంగానే పోరాడుతానని రంగనాథ్ వెల్లడించారు.

## నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

- సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్




**వనపర్తి, జూలై 27 (పీపుల్స్ న్యూస్) :** నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కేంద్ర ప్రభుత్వ హత్యలేనని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి అంబేద్కర్ చౌక్ లో నీట్ రద్దు వల్ల కలత చెంది ఆత్మహత్య చేసుకొని అమరులైన 23 మంది విద్యార్థులకు కొవ్వొత్తులతో సాయంత్రం నివాళులర్పించి వారి ఆశయాలను సాధిస్తామని నినాదాలు చేశారు. నీట్ మరో విద్యార్థిని కూడా ఆత్మహత్య చేసుకుందని కేంద్రపాపం ఎందరిని బలి తీసుకుంటుందో తెలియదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థి మృతులకు రూ. కోటి పరిహారంఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఉద్యమంలో పాల్గొన్న యువకులు విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలన్న డిమాండ్లకు అంగీకరించిన కేంద్రం బీహార్ బెంగాల్ అస్సాం తదితర రాష్ట్రాల్లో విద్యార్థులపైఎఫ్ఐఆర్ నమోదు చేసిఅరెస్టు చేయటం దారుణం అన్నారు. రేపటిలోగాకేసులను ఎత్తేయకపోతే మళ్లీ ఉద్యమిస్తామని సీజెపి అల్టిమేట్ ఇచ్చిందని,ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేయాలని, విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, ఐప్సో సమన్వయ కార్యదర్శి శివ సామాజిక కార్యకర్తలు గంధం నాగరాజు, బాలేమియా ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ కేంద్రం నిరుద్యోగ యువకులు విద్యార్థులపై కక్షపూరిత వైఖరిని అనుసరించటం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం దారుణం అన్నారు. హామీలను అమలు చేయకుంటే మళ్లీ ఉద్యమం తప్పదని పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చి పోరాడుతుందన్నారు. సిపిఐ నేతలు కళావతమ్మ ,కృష్ణవేణి, జయమ్మ ,గంధం నాగరాజు, చిన్న కుర్మన్న, బాలేమియా, లక్ష్మీనారాయణ, సురేష్ ,మల్లెపు నరసింహా, చందు, మంద సురేష్ శివ వంశి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పౌరులందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి

**- జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె. హరి ప్రసాద్**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 27 (పీపుల్స్ న్యూస్) :** పౌరులందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె. హరి ప్రసాద్ అన్నారు. ఎరైవ్ అలైవ్" ప్రచారంలో భాగంగా ఎన్టీఆర్ జంక్షన్ వద్ద 200 హెల్మెట్లు పంపిణీ చేసిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు చేపట్టిన "ఎరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా, జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ పోలీస్ శాఖ, తారక్ ట్రస్ట్ సహకారంతో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జంక్షన్ వద్ద రహదారి భద్రతా అవగాహన సదస్సు, ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె. హరి ప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్ ఎస్హెచ్ఓ కె. సునీల్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించి, ద్విచక్ర వాహనదారులు , వెనుక కూర్చున్న ప్రయాణికులకు (పిలియన్ రైడర్స్) 200 ఐఎస్ఐ ముద్ర కలిగిన హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాహనదారులతో ముఖాముఖిగా మాట్లాడి, తలకు అయ్యే ప్రాణాంతక గాయాలను నివారించడంలో హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం , ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దృష్టి మళ్లించే పనులకు దూరంగా ఉండాలని , లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే వాహనాలను నడిపేలా చూడాలన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిన ఈ కార్యక్రమం, విద్య , సమాజ భాగస్వామ్యం ద్వారా సురక్షితమైన రహదారులను నిర్మించడంలో పోలీస్ శాఖకున్న కట్టుబాటును పునరుద్ఘాటించింది అని తెలిపారు.

# పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఫోరెన్సిక్ సిబ్బంది సంఖ్యను మరింత పెంచాలి

**- తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్**






**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో జూలై 27 (పీపుల్స్ న్యూస్) :** పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఫోరెన్సిక్ సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన 57 మంది ఫోరెన్సిక్ ఉద్యోగులకు సోమవారం డీజీపీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేరాల దర్యాప్తులో నేరస్థుడిని ఎంత కష్టపడి పట్టుకున్నా, శాస్త్రీయ ఆధారాలు ,ఫోరెన్సిక్ సైన్స్ నివేదికలు పటిష్టంగా లేకపోతే కోర్టులో కేసులు బలహీనపడే అవకాశం ఉంటుందన్నారు. నేర నిరూపణలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు., దేశంలో అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా శాస్త్రీయ దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణులు అందించే నివేదికలే చార్జిషీట్‌కు కోర్టులో కేసు నిరూపణలో ప్రధాన ఆధారమవుతాయని, వీటికి ప్రాధాన్యం అత్యంత ఎక్కువగా ఉంటుందని డీజీపీ తెలిపారు. శాస్త్రీయ ఆధారాలు బలంగా లేకపోతే నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు. కోర్టు విచారణ విధానం, సాక్ష్యాలను ప్రవేశ పెట్టడంలో , కొత్త చట్టాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఫోరెన్సిక్ నివేదిక అత్యంత నాణ్యతతో, నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. అవసరమైన ఆధునిక పరికరాలు, కెమికల్స్, ఇతర మెటీరియల్‌ను సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. నూతనంగా నియమితులైన 57 మందిలో 36 మంది పీహెచ్‌డీ, 15 మంది ఎంటెక్ పట్టభద్రులు ఉండటం సంతోషకర విషయమని డీజీపీ పేర్కొన్నారు. వారి విద్యార్హతలు ఫోరెన్సిక్ విభాగ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఢ టీజీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ పరిమిత సిబ్బందితోనే ఫోరెన్సిక్ ల్యాబ్ 80 శాతానికి పైగా కేసులను పరిష్కరిస్తోందన్నారు. దేశంలో అత్యధికంగా ఫోరెన్సిక్ నివేదికలను అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని తెలిపారు. 2025లో మొత్తం 18,647 కేసులను పరిష్కరించి 86 శాతం డిస్పోజల్ రేటు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రాధాన్య కేసుల్లో నిర్ణీత గడువులోనే ఫోరెన్సిక్ నివేదికలు అందజేస్తున్నామని వివరించారు. డీఎన్ఏ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, నార్కోటిక్స్, టాక్సికాలజీ తదితర



విభాగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. డిజిటల్ సాక్ష్యాల పరిశీలన, మాదకద్రవ్యాల కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ల్యాబ్‌ను మరింత ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటూ గుర్తింపును కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన 57 మంది సైంటిఫిక్ ఆఫీసర్స్ లో 36 మంది పీహెచ్‌డీలు, 12 మంది ఎంఎస్సీ, ఆరుగురు ఎం.టెక్, ముగ్గురు ఎంసీఏ పట్టభద్రులు ఉన్నారు. వీరి నియామకంతో ల్యాబ్ సామర్థ్యం మరింత పెరిగి, పోలీ శాఖకు శాస్త్రీయ ఆధారాలతో కూడిన వేగవంతమైన ఫోరెన్సిక్ సేవలు అందనున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు టీజీఎఫ్ఎస్ఎల్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించగా, సమాచార సాంకేతిక చట్టం--2000లోని సెక్షన్ 79ఏ కింద ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రభుత్వ పరీక్షా సంస్థగా గుర్తింపు పొందింది. 57 మంది శాస్త్రీయ సిబ్బంది నియామకంతో తెలంగాణలో ఫోరెన్సిక్ సామర్థ్యాలు మరింత బలోపేతమై, నేరాల దర్యాప్తు వేగవంతం కానుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ జాయింట్ డైరెక్టర్లు మధుశ్రీ, రవికుమార్ గౌడ్, దార్మిత, అసిస్టెంట్ డైరెక్టర్లు తో పాటు ఉన్నతాధికారులు, తెలంగాణ పోలీస్ శాఖ అధికారులు, నూతనంగా నియమితులైన ఉద్యోగులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం

**హైదరాబాద్** వాసులకు ఉపశమనాన్ని ఇస్తూ వరసగా రెండో రోజు భారీ వర్షం పడుతోంది. సోమవారం రాత్రి పది గంటల తర్వాత వాన అందుకోవడంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు, కాలనీలు జలమయ్యాయి. బోరబండ, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, పంజాగుట్ట, ఫిలింనగర్, ఎస్ఆర్ నగర్‌లో వాన దంచికొడుతోంది.రాష్ట్ర రాజధానిలో మళ్లీ వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి భారీ వర్షంతో ఉపశమనం పొందిన నగరవాసులను సోమవారం కూడా వరుణుడు పలకరించారు. సాయంత్రం నుంచే ఆకాశం మేఘావృతమై.. నల్లని మబ్బులు కమ్ముకోగా.. రాత్రి వాన మొదలైంది. బంజారాహిల్స్,



పంజాగుట్ట, అమీర్‌పేట, ఎర్రగడ్డ, జూబ్లీహిల్స్, రహమత్ నగర్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, బేగంపేట.. తదితర ప్రాంతాల్లో వర్షం ంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలం మొదలైన వానలు కరువై ఎండాకాలాన్ని తలపించిన రోజులకు మొత్తానికి బ్రేక్ పడి

# ఈఎస్ఐ ఆస్పత్రి కోసం కేంద్ర మంత్రి మన్సుఖ్ ను కలిసిన మంత్రి వివేక్,ఎంపీ వంశీకృష్ణ

**పెద్దపల్లి,జులై 27**



పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రామగుండం ప్రాంత ప్రజలు ముఖ్యంగా సింగరేణి కార్మికుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర కార్మిక,ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ను కలిసి రామగుండం ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో సుమారు ?150 కోట్లతో రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాజెక్టుకు ఆమోదం లభించి,టెండర్ దశ వరకు వెళ్లినప్పటికీ అనంతరం పనులు నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పునరుద్ధరణకు సంబంధించి సమగ్ర వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. కేంద్ర మంత్రి ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతం కావడంతో వేలాది మంది సింగరేణి కార్మికులు,ఈఎస్ఐ లబ్ధిదారులు మెరుగైన వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారని,అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం అత్యవసరమని ఎంపీ వంశీకృష్ణ కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమయ్యే వరకు తాను నిరంతరం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూ రామగుండం ప్రజలకు మరియు సింగరేణి కార్మికులకు న్యాయం జరిగేలా పోరాటాన్ని కొనసాగిస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు."రామగుండం ప్రజల ఆరోగ్య హక్కు కోసం,సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఈ ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు మా ప్రయత్నాలు ఆగవు" అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.

# గ్రామపంచాయతీలో నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానం పై అవగాహన...!





**బచ్చన్నపేట, జూలై 27:** బచ్చన్నపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్వాల నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ... గ్రామ ప్రజలందరూ తడి చెత్త, పొడి చెత్త, గృహ ప్రమాదకర చెత్త, శానిటరీ చెత్తలను వేర్వేరుగా సేకరించి నిర్వహించే అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇంటి చెత్తను రోడ్లపై, కాలువల్లో లేదా ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా, గ్రామపంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్‌కే అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన బచ్చన్నపేట నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం హెడ్ కు శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ ఎన్ అశోక్




**హైదరాబాద్ జూలై 27** ఉస్మానియా విశ్వవిద్యా లయం రాజనీతి శాస్త్ర విభాగనీ కి హెడ్ గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ శ్రీలత మేడంకు పూల మొక్క ను అందించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకు న్న డాక్టర్ ఎం అశోక్ ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కురిషిద్ మియా ..డాక్టర్ వెంకటేశం కల్తి. ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల మోదీ సర్కార్ అత్యంత క్రూరంగా ప్రవర్తిస్తోంది



**న్యూ ఢిల్లీ :** విద్యార్థి లోకం పట్ల మోదీ సర్కార్ అత్యంత క్రూరంగా ప్రవర్తిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తీవ్రస్థాయిలో విమ ర్శలు గుప్పించారు. వివిధ రాష్ట్రాల్లో విద్యార్థుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం ఏకే-47, పెల్లెట్ గన్స్‌లతో సహా పెద్ద సంఖ్యలో పోలీసు బలగా లను ఉపయో గిస్తోందని ఎక్స్ వేదికగా ఆరోపి ంచారు. "మొత్తం వ్యవస్థే విద్యార్థులకు వ్యతిరే కంగా అత్యంత కూరంగా వ్యవహరిస్తోంది. బిహార్‌లో నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47 బుల్లెట్లతో కాల్పులు జరిగాయని, వందలాది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని వార్తలు వస్తున్నా యి. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారు. ఉత్తరప్రదేశ్, బంగాల, బిహార్, ఢిల్లీ- ఎక్కడైనా సరే ఇదే పద్ధతి కొనసా గుతోంది. మిస్టర్‌మోదీ, విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయమని, వారిని విడు దల చేస్తామని మీరు ఇచ్చిన హామీ ఏమైంది దానికి బదులుగా విద్యార్థులపై ప్రాణాంతక దాడులు చేస్తున్నారు. క్రూరంగా ప్రవర్తిస్తున్నా రు. నేను ఇంతకు ముందే చెప్పాను, ఈ ప్రభుత్వానికి నిజాయితీ లేదని. నిజమైన సంస్కరణలు చేయడం వీరి వల్ల కాదు. వారు తమ మాటల నుంచి వెనక్కి తగ్గుతారు. విద్యార్థుల గొంతును నొక్కడానికి అన్ని రకాల ట్రిక్కులను ఉపయోగిస్తారు. మిస్టర్? మోదీ, దేశంలోని విద్యార్థులు అందరికీ క్షమాపణ చెప్పండి. విద్యార్థులపై కాదు, వారిపై దాడి చేసి వారిని అణచివేసిన వారిపై చర్యలు తీసుకోండి. "- రాహుల్ గాంధీ, లోక్?సభలో ప్రధాన ప్రతిపక్ష నేతఅమిత్? షానే కారణం!జులై 20న జరిగిన 'సంసద్? ఛలో' నిరసనల సందర్భంగా విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జికి అమిత్? షానే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో "విద్యార్థులపై పోలీసు చర్యలు" అంశంపై జరిగిన చర్చల సందర్భంగా ఆయన ఈ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై తక్షణమే చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ రూల్? 267 కింద నోటీసు ఇచ్చానని చెప్పారు. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని చేపట్టడం సాధ్యం కాదని రాజ్యసభ ఛైర్మన్? సీపీ రాధాకృష్ణన్? స్పష్టం చేస్తూ, గతంలో ఇచ్చిన రూలింగ్స్‌ను ప్రస్తావించారు. అయినా సరే దీనిపై చర్చ జరపాలని ఖర్గే పట్టుబట్టారు. "భారతదేశ గందరగోళం ఏర్పడడంతో ఛైర్మన్ సభను ఉపయోగమేంటి మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'న్యూ ఎగ్జామ్ బిల్లు' వల్ల ఎలాంటి ఉపయోగం లేదని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ అభిప్రాయపడ్డారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని ఇంకా ఎఫ్?ఐఆర్?లను నమోదు చేస్తూనే ఉన్నారు. మరి 'పబ్లిక్ ఎగ్జామినేషన్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026' ఉద్దేశం ఏమిటని ఆమె ప్రశ్నించారు. "బిహార్, బంగాల్ రాష్ట్రాల్లో విద్యార్థులపై ఇంకా ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతున్నాయని నేను విన్నాను. అయితే అవి నిజమో, కాదో నాకు ఇంకా తెలియదు. నా ఉద్దేశం ఏమిటంటే, విద్యార్థులపై ఇంకా కేసులు నమోదు అవుతుంటే, అలాంటప్పుడు కొత్తగా తెస్తున్న పేపర్ లీక్ నిరోధక బిల్లు వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?" అని ప్రియాంక్ గాంధీ నిరసనలుమరోవైపు విద్యార్థులపై పోలీసుల చర్యను తప్పుబడుతూ, పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్ష నేతలు సోమవారం నిరసనలు చేపట్టారు. ఈ అంశంపై తక్షణమే పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. దీనిపై లోక్‌సభలో వాయిదా తీర్మానం , రాజ్యస భలో బిజినెస్ సస్పెన్షన్ నోటీసులు ఇచ్చాయి.

## గడ్కరీతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం.



**న్యూఢిల్లీ, జులై 27:** తనతోపాటు తన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్ర చారంపై కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టును ఆయన ఆశ్రయి ంచారు. మెటా () సహా సోషల్ మీడి యా ప్లాట్‌ఫామ్‌ల తోపాటు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాంబే హైకోర్టులో ఆయన సివిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇథనాల్ బ్లెండింగ్ పాలసీ పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోనిదని ఆయన స్పష్టం చేశారు. తనపై కావాలనే నిందలు వేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఏఐ (ూ×) డీప్ ఫేక్ వీడియోలు, అసత్య ప్రచారాలను వేగంగా వ్యాప్తి చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. జు 20 ఇథనాల్ వ్యాపారంలో లాభపడ్డారంటూ తనపై వస్తున్న ఆరోపణలను నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఇథనాల్ పాలసీకి రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు ఏ మాత్రం సంబంధం లేదని కేంద్ర మంత్రి గడ్కరీ స్పష్టం చేశారు. ఈ 20 ఇథనాల్ వ్యాపారం పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోనికి వస్తుందని చెప్పారు. ఈ20 (జు 20) ఇథనాల్ బిజినెస్ ద్వారా అక్రమ లాభాలు పొందారంటూ నితిన్ గడ్కరీతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై తప్పుడు కథనాలు... డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాలతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సీరియస్ అయ్యారు. ఈ ప్రచారం చేస్తున్న వారితోపాటు సోషల్ మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోర్టుకు మంత్రి నితిన్ గడ్కరీ విన్నవించారు.

## విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు.. కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు



**'బిహార్ :**రెండు రోజుల క్రితం 'బిహార్ బంద్' సందర్భ ంగా శివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిరసన కార క్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఓ పోలీసు సిబ్బం ది'ఏకే-47' (ూఖ-47) రైఫిల్ తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. దీనికి సం బంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న బిహార్‌లో విద్యార్థి సంఘాలు చేపట్టిన 'బిహార్ బంద్' సందర్భంగా పలు జిల్లాల్లో నిరసన కారులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ అనే యువకుడు కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా మెడకు బుల్లెట్ తగిలిందని కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేస్తూ... కాల్పుల ఘటనకు సంబంధించిన వీడియోను నెట్‌లో షేర్ చేశాడు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఢిల్లీలో నిరస న తెలిపే విద్యార్థులపై పెల్లెట్ తుపాకులు, బిహార్‌లో ఏకే-47లు ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు

# లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు- విపక్షాల నినాదాలతో గందరగోళం



**న్యూ ఢిల్లీ :** ప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్? పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టి ంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అయితే జులై 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొ దంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో 'సంసద్ ఛలో' కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారంటూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జితో పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. గందరగోళం కాదు, బిల్లుపై సమగ్ర చర్చ జరపండి : కిరణ్ రిపబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్?తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందర గోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరిం చేందుకు కీలక బిల్లును తీసుకొచ్చా మని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటల పాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయించినట్లు సమాచారం. బీజేపీ ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యతో పాటు జేడీయూ, టీడీపీ, శివసేన, ఎన్?సీపీ, అప్నాదళ్, ఎల్‌జేపీ (రాంవిలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. బిల్లులో ఏడు కీలక సవరణలుఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్షల అక్రమాల ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్థులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.

# ఆస్పత్రి నుంచి సోనమ్ వాంగ్‌చుక్ డిశ్చార్జ్



**న్యూ ఢిల్లీ :**నీట్ వ్యవహారంలో నిరాహార దీక్ష చేసిన లద్ధాఖ్ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఎ ేదాంత ఆస్పత్రి నుంచి సోమవారం డిశ్చార్జ్ అ య్యారు. ఇప్పుడు తాను చాలా మెరుగ్గా ఉన్నానంటూ ఓ వీడియో విడుదల చేశారు. క్రమంగా ఆహారాన్ని తీసుకుంటూ, శరీరంలో సత్తువ పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాని అన్నారు. లద్ధాఖ్‌లోని తన ఇంటికి వెళ్లే ముందు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీజీకి నివాళి అర్పిస్తానని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ, తమ గళాన్ని విప్పి నిరసన వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పారు."చివరికి నేను ఈ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యే రోజు వచ్చింది. ఈ రోజు ఇక్కడి నుంచి బయలుదేరి, తిరిగి నా స్వస్థలమైన లద్ధాఖ్?కు వెళ్లే ముందు, మహాత్మ గాంధీకి నివాళి అర్పించడానికి రాజ్?ఘాట్?కు వెళ్తాను. మీకు గుర్తు ఉండవచ్చు. నేను స్విట్జర్లాండ్? నుంచి తిరిగి వచ్చిన తర్వాత, జంతర్ మంతర్? వద్ద నిరాహార దీక్షను ప్రారంభించే ముందు కూడా ఇలానే చేశాను. ఇప్పుడు కూడా అదే చేస్తాను. ఆ తర్వాత లద్ధాఖ్?లోని మా ఇంటికి బయలుదేరుతాను. ఇక్కడి నుంచి వెళ్లే ముందు, మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయాలని అనుకుంటున్నాను. దేశవ్యాప్తంగా నలుమూలల నుంచి, అన్ని వయస్సుల ప్రజలు ఒక ఉద్యమాన్ని నడపడానికి మాతో కలిసి గొంతు కలిపారు. అందుకే మేము విజయం సాధించాం. ఇది ఇలాగే కొనసాగుతుంది. మీ అందరితో కనెక్ట్ అయి ఉంటానని నేను ఆశిస్తున్నాను. సెల్యూట్, నమస్కారం, జుల్లే (లద్దాక్ సంప్రదాయ అభివాదం), జైహింద్."- సోనమ్ వాంగ్‌చుక్, ప్రముఖ సామాజిక కార్యకర్తనీట్- నిరాహార దీక్షఒక సెటైరికల్ సోషల్ మీడియా ఖాతాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మొదలైంది. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్ వ్యాఖ్యలతో దీనికి అనుకోకుండా ఎక్కడాలేని పాపులారిటీ వచ్చింది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది జరిగిన నీట్?-యూజీ 2026 పేపర్ లీక్ అయ్యింది. దీనితో ఈ పరీక్షల అక్రమాలను వ్యతిరేకిస్తూ సీజేపీ ఢిల్లీలోని జంతర్? మంతర్ వద్ద నిరసన కార్యక్రమం ప్రారంభించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామా నిర్వహణలో సంస్కరణలు తేవాలని, బలవన్మరణాలకు పాల్పడిన వారి కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలనే డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచింది. వీరికి మద్దతు ప్రకటించిన వాంగ్?చుక్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు సూచనల మేరకు పోలీసులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతుండడాన్ని ఆసరాగా చేసుకొని, సీజేపీ 'సంసద్ ఛలో' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణ చెలరేగింది. దీనితో లాఠీ ఛార్జ్ చేసి, వాళ్లను చెల్లాచెదురు చేశారు. ఆ తర్వాతి రోజు రాత్రి జంతర్ మంతర్ వద్ద భారీగా విద్యార్థులు, నిరసనకారులు చేరుకున్నారు. వారికి వివిధ రాజకీయ పార్టీలు, సినీ, క్రీడా ప్రముఖులు మద్దతు ఇవ్వడం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నేరుగా ప్రధాని మోదీ నివాసం ఎదుట ధర్నా చేసింది. దీనితో మోదీ సర్కార్ దిగి వచ్చి, సీజేపీ ప్రతినిధులతో చర్చలకు ప్రతిపాదించింది. కేంద్ర మంత్రులు ఇచ్చిన హామీతో తన నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు వాంగ్?చుక్? ప్రకటించారు. మరోవైపు సీజేపీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టింది. ఈ నేపథ్యంలో మరో దఫా చర్చలు జరగకముందే, ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. మిగిలిన డిమాండ్లకు కూడా కేంద్రం ఓకే చెప్పింది. దీనితో 37 రోజుల పాటు కొనసాగిన ఆందోళనలను కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

## నేను ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు స్ట్రీట్ ఫైటర్‌ను



**ఢిల్లీ** కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత తొలిసారి పార్లమెంటు వచ్చిన ధర్మేంద్ర ప్రధాన్ .. కాంగ్రెస్ సీనియర్ నేత (జైరామ్ రమేశ్ వ్యాఖ్యలకు (స్ట్రాంగ్ కౌంటర్ ) ఇచ్చారు. నీట్ పేపర్ లీకేజీ () వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ) పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్.. సోమవారం పార్లమెంటుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతో కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్.. అందరికీ అభివాదంచేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికారపక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని బీజేపీ ఎంపీల్లో ఒకరు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్.. ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. 'ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని (స్ట్రీట్ ఫైటర్‌ను), ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు' అని కౌంటర్ ఇచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన నిరసనల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయాలనే డిమాండ్ బలంగా వినిపించడంతో శనివారం తన పదవి నుంచి తప్పుకున్నారు.

## ఉక్రెయిన్‌కు తగిన శాస్తి చేస్తాం..

**కాస్పియన్** సముద్రం లో ప్రయాణిస్తున్న తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బలగాలు జరిపిన దాడిలో ఒక నావికుడు ప్రాణాలు కోల్పోగా, మరో నావికుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ భద్రతను ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ చర్యకు పాల్పడిన ఉక్రెయిన్‌కు రాబోయే రోజుల్లో తగినశాస్తి జరుగుతుందని, యుద్ధం మరింత ముదరకుండా చూడాలంటే కీవ్ వైఖరిని ఐరోపా దేశాలు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రష్యా-ఉక్రెయిన్ పోరుతో ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ పదేపదే చెబుతున్నప్పటికీ.. రష్యా నుంచి ఇరాన్ శాటిలైట్ సమాచారాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలు అమెరికా మిలిటరీ స్థావరాలపై రష్యా సేకరించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ తన దాడుల కోసం వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన ఆంక్షలవల్ల చైనా తదితర దేశాల నుంచి వస్తువుల రవాణాకు ఇరాన్‌కు ఈ కాస్పియన్ సముద్ర మార్గమే దిక్కుగా మారింది. అలాంటి కీలకమైన దారిలో నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది.

## నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం



**న్యూ ఢిల్లీ :**శాంతియుతంగా నిరసన తెలపడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారీ నిరసనల సందర్భంగా పోలీసులు అనుసరించాల్సిన విధివిధానాలపై దేశవ్యాప్తంగా ఒకే రకమైన మార్గదర్శకాలను రూపొందించే అంశాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా తెలిపింది. ఈ మేరకు సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. సోమవారం పలు పిటిషన్లను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. శాంతియుత ఆందోళన జరుగుతున్నంత మాత్రాన లాఠీఛార్జ్ వంటి బలప్రయోగానికి పాల్పడకూడదని, పోలీసుల నుంచి అధిక బలప్రయోగం జరిగితే స్వతంత్రంగా విచారణ జరగాలని వ్యాఖ్యానించింది. ప్రభుత్వాలను వివరణ కోరే అంశాన్నీ నిరసనల్లో గాయపడిన ఆందోళనకారులు ఎంతముఖ్యమో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది భద్రత కూడా అంతే ప్రధానమని ధర్మాసనం పేర్కొంది. ప్రజలు, పోలీసులు ఇద్దరూ స్వీయ క్రమశిక్షణ పాటించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని అభిప్రాయపడింది. నిరసనల ను ని విధుల్లో ఉన్న పోలీసులకు తగిన రక్షణ పరికరాలు, హెల్మెట్లు, భద్రతా సామగ్రి అందించారా లేదా అనే విషయంపైనా రాష్ట్ర ప్రభుత్వాలను వివరణ కోరే అంశాన్నీ పరిశీలిస్తామని తెలిపింది. ఆందోళనల సమయంలో పోలీసుల చర్యలపై దేశవ్యాప్తంగా ఒకే విధమైన ప్రామాణిక విధానాలు(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్) అవసరమని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అనుమతి పొందిన ప్రదేశాల్లో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందంది. అయితే హింసకు పాల్పడిన సంఘ విద్రోహులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. నిష్పాక్షికంగా పరిశీలన చేపడతామని స్పష్టం చేసింది.


# సంపాదకీయం

## జవాబుదారీతనం కోల్పోవడంతోనే ...
# ప్రజా ఉద్యమాలు !

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్ధతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

● శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



**విజయవాడ,జూలై 27:** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయల అలంరాంతో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణమంతా కూరగాయలతో అలకరించారు. ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా శాకంబరీ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలు పండి, దేశం సస్యశ్యామలంగా ఉండేందుకు ప్రతి ఏడాది శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో శాకంబరీ దేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మ సన్నిధికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. అమ్మవారి ఒంటి మీద నుంచి తీసిన శాఖాలతో కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారు. కదంబ ప్రసాదాన్ని స్వీకరిస్తే అనారోగ్యాలు పోయి ఆరోగ్యంగా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

## తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



**హైదరాబాద్,జూలై27:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు

## వరుసపెట్టి దాడులు చేస్తున్న ఎసిబి
## వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు




**హైదరాబాద్,జూలై27:** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమారు కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపెపద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతున్నా, పెద్ద చేపల విషయంలో ఎసిబి పక్కాగా సమాచారం సేకరించి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠినవైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది.ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచాలు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి.కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది. ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన ప్రక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# యువరక్తమూ– అల్పత్వము

వెలుగుతున్న ఆశ ఒకవైపు, కొనసాగుతున్న అల్పత్వము మరోవైపు. నేడు దేశ కదలికను గమనిస్తుంటే భవిష్యత్తు పట్ల ఆశలు చిగురిస్తున్నాయి. ఏం చేయలేమనే నిరాశ నుంచి ఏదైనా చేయగలమనే ధైర్యం నిండుతోంది. మాకిక తిరుగులేదనుకున్నవారికి తలలు తిరిగేట్టు జరగటం చూస్తుంటే సామాజిక శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు, సిద్ధాంతాలు ఎంత వాస్తవికమైనవో అర్థమవుతున్నది. నిరసనల నిప్పురవ్వ అంటుకుంటే ఎంత దావానలమై ముంచెత్తుతుందో స్పష్టపరిచింది నేటి యువత తిరుగుబాటు. గత 38 రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరవధికంగా జరుగుతున్న నిరసన అత్యంత పదునైన దీక్షతో కొనసాగటం అనేకమంది రాజకీయ నాయకులను, సామాజిక కార్యకర్తలను, సాధారణ ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నది. నిర్మాణ రూపమే లేని ఒక సోషల్ మీడియా 'కాక్రోచ్' యువత, ఇంత నిబద్ధంగా, పట్టుదలతో,క్రమశిక్షణతో ఉద్యమాన్ని నిర్మించడం చూస్తే, ఎక్కడ అణచివేత, దోపిడీ వేదన ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదన్న సత్యం రుజువుతున్నది. నిర్మాణాత్మక వామపక్ష విద్యార్థి ఉద్యమమూ తోడుగా చేరటము మరింత పదునుతేరుతున్నది. ఇదో శుభపరిణామం.“పదిమంది ఉక్కు గుండెలుగల యువకులను నాకివ్వండి, నేను ఈ దేశాన్ని మార్చివేస్తాను” అని స్వామి వివేకానంద చెప్పిన




మాటలు ఈ సన్నివేశాన్ని చూస్తే ఎంతో నిజమని అర్థమవుతున్నది.నిరసన చాలా సామాన్యంగానే ప్రారంభమ యింది. ప్రభుత్వమూ పెద్దగా పట్టించుకోకుండా తేలికగానే చూసింది. జూలై ఇరవై తర్వాత నిరసన ఉద్యమ రూపం అందుకుంది. దేశవ్యాప్తంగా యువత కదం తొక్కింది.బీజేపీ తిరుగులేని ఆధిపత్యం వహిస్తున్న రాష్ట్రాల నుంచి అన్ని ప్రాంతాలలోనూ ప్రశ్నతో, నినాదంతో మార్మోగింది. ఇక్కడేకాదు, దేశం వెలుపల, అనేక దేశాలలో యువత మద్దతును ఈ ఉద్యమం పొందింది. అప్పటిగానీ అయ్యవార్లకు అర్థంకాలేదు. ఎన్ని ఆటంకాలు ఎగదోసింది ప్రభుత్వం! ఎంత దుష్ప్రచారం మొదలైంది. ఎంత దారుణంగా క్రూరంగా అణచివేయటానికి పూనుకొంది. రక్తం పారించింది. తలలు పగలగొట్టింది. చేతులు, కాళ్లు విరగగొట్టింది. రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ లు, ముండ్ల కంచెలు, దేశద్రోహ కేసులు, నిర్దాక్షిణ్య నిర్బంధాలు అన్నీ ఉపయోగించింది. ఇంకోవైపు నైతికతను దెబ్బతీస్తూ, విదేశీయుల సహకారంతో, మద్దతుతో నడుస్తోందని, సంఘవిద్రోహ శక్తులని, దేశ సమగ్రతను, శాంతిని విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతోందని, దొంగ దీక్షలు చేస్తున్నారని ఒక నీచ ప్రచారము చేసింది. నీళ్లను బంద్ చేసింది. కరెంటునూ, ఇంటర్నెట్ నూ, రహదారులను, మెట్రో స్టేషన్లను బంద్ పెట్టి నిలిపివేసింది.ఇన్ని చేసినా, ఇంత విధ్వంసం ఒక రాజ్యం చేస్తున్నా... నిలకడగా నిబ్బరంగా వీటన్నింటినీ ఎదుర్కొని ఇన్ని రోజులుగా పోరాటం కొనసాగటం చరిత్రలో నిలిచిపోయే మహా సంఘటన. ఇది ఒక పరీక్ష పేపర్ లీకేజీ సమస్యే కాదు, విద్యావ్యవస్థ మొత్తం ప్రయివేటు, కార్పొరేట్ల చేతుల్లోకి పోవడం, పర్యవసానంగా వ్యాపారం, లాభాలు మాత్రమే లక్ష్యంగా మారింది. నిరుద్యోగం, పరిశ్రమల మూత, గ్రామీణ ప్రజల ఆదాయాల కోత, ధరల పెరుగుదల, హక్కుల అణచివేత అన్నిటి ప్రభావాల ప్రతిఫలనం ఈ ప్రతిఘటన. ప్రశ్నించినవాళ్లను , న్యాయం అడిగినవాళ్లను దేశద్రోహులుగా చూస్తూన్న ప్రభుత్వ నియంతృత్వ పోకడపై వెల్లువెత్తిన ఆగ్రహం ఇది. ముప్పయి రోజుల తర్వాత, యువత దేశానికి అతి ముఖ్యమైన శక్తి అని, వారి సమస్య దేశపు సమస్య అని ప్రధాని మాట్లాడటం సిగ్గులేనితనం.

మంగళవారం, జూలై 28, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
8

## భగవద్గీత 4వ అధ్యాయం పారాయణం చేస్తే పాపాలు తొలగుతాయా రేగి చెట్లుగా మారిన అప్సరసలకు శాపవిమోచనం ఎలా కలిగింది?



: శ్రీకృష్ణ పరమాత్మ మానవాళికి అందించిన దివ్య సందేశం భగవద్గీత. కురుక్షేత్ర సంగ్రామంలో నిర్వేదంతో ఉన్న అర్జునునికి కర్తవ్య బోధ చేస్తూ శ్రీకృష్ణుడు ప్రవచించిన దివ్య ప్రవచనమే భగవద్గీత! భగవద్గీతలోని ప్రతి అక్షరం పుణ్యప్రదమైనదే. విశేషించి గీతలోని నాల్గో అధ్యాయం విశేష ఫలదాయకం. ఘోరమైన శాపాలను కూడా తొలగించే శక్తి ఈ పారాయణకు ఉంది. భగవద్గీతలోని నాలుగో అధ్యాయం పారాయణం వల్ల కలిగే ఫలం గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### ఈ పారాయణం మహిమాన్వితం

భగవద్గీతలోని పరమ పవిత్రమైన నాలుగో అధ్యాయం గురించి, ఈ అధ్యాయం పారాయణ గురించి పద్మ పురాణంలో ఈ విధంగా వివరించి ఉంది. అదేంటో చూద్దాం.

### భరతుని కథ

పూర్వం వారణాసిలోని విశ్వేశ్వరుని ఆలయంలో భరతుడు అనే మహా నీయుడు భగవద్గీత నాలుగో అధ్యాయనాన్ని ప్రతినిత్యం శ్రద్ధాభక్తులతో పారాయణం చేస్తూ ఉండేవాడు. ఆ పారాయణ ఫలంగా అతడు పవిత్రుడై, కష్టనష్టాలను, సుఖదుఃఖాలను సమభావంతో స్వీకరిస్తూ, సమబుద్ధితో అనుభవిస్తూ ఉండే వాడు. ఒకసారి ఆతడికి మహాత్ములను సంద ర్శించాలనే కోరిక కలిగి వారు నివసించే ప్రదేశాలు వెతుక్కుంటూ పర్యటనకు బయల్దేరాడు.

### కన్యలుగా మారిన రేగుచెట్లు

ఒకరోజు భరతుడు ప్రయాణం చేసే మార్గంలో ఒక చోట సంధ్యా సమయం కాగా అక్కడున్న రెండు పెద్ద రేగి చెట్ల కింద విశ్రమించి, నిత్యం తాను పారాయణ చేసే భగవద్గీత నాలుగో అధ్యాయాన్ని ప్రతి రోజు మాదిరి పారాయణ చేశాడు. బయల్దేరే సమయంలో తన ముందు రాలిన రెండు రేగి పండ్లను తన సంచిలో వేసుకుని బయల్దేరాడు. అయితే ఇక్కడ ఒక చిత్రం జరిగింది. ఆ రెండు రేగి చెట్లూ ఐదు రోజుల్లో ఎండిపోయాయి. వాటిలోని జీవులు ఒక ఇంట ఇద్దరు బాలికలుగా జన్మించారు. అంతేకాదు వారికి పూర్వ జన్మ జ్ఞానం కలిగింది. ఒకమారు ఏదో పని మీద వెళ్తున్న భరతుడు మరో ఊరిలో ఉన్న వారి ఇంట విడిది చేశాడు. వారు భరతునికి అర్ఘ్యపాద్యాదులిచ్చి తమ పూర్వ జన్మ వృత్తాంతం ఆయనకు ఇలా చెప్పసాగారు.

### కన్యల పూర్వజన్మ వృత్తాంతం

ఒకప్పుడు గోదావరీ తీరాన సత్యతవుడు అనే యోగిపుంగవుడు ఘోర తపస్సు చేస్తూ ఉండేవాడు. ఇంద్రుడు అతడి తపస్సుకు భయపడి తనకు పదవీ భంగం కలుగుతుందేమోనని ఇద్దరు అప్సరసలను ఆ సత్యతవుని తపస్సు భంగం చేయడానికి పంపాడు. తమ ప్రభువైన ఇంద్రుని ఆజ్ఞ మేరకు వారు సత్యతవుడు తపస్సు చేస్తున్న ప్రదేశానికి చేరుకుని తపస్సుకు భంగం కలిగించేందుకు ప్రయత్నించారు.

### అప్సరసలను శపించిన మహర్షి

అప్పుడు సత్యతవుడు కోపించి వారిద్దరినీ గంగా తీరంలో రేగి చెట్లు కమ్మని శపించాడు. దానితో వారిరువురూ తాము తమ ప్రభువైన ఇంద్రుని ఆజ్ఞ మేరకు అక్కడకు వచ్చామని శాప విమోచనం కలిగించమని కోరారు. దానితో ఆయన శాంతించి, భరతుడనే మహనీయుడు మీ చెట్ల నీడన కూర్చుండి భగవద్గీత నాలుగో అధ్యాయం పారాయణ చేసినప్పుడు అది విని మీరు పూర్వజన్మ జ్ఞానం కలిగిన బాలికలుగా జన్మిస్తారు. మీ వృత్తాంతాన్ని భరతునికి చెప్పి ప్రతి రోజు పారాయణ చేస్తుంటే, క్రమంగా మీరు మీ నిజ స్వరూపాలు పొంది స్వర్గానికి చేరుకోగలరని శాపవిమోచనం వివరించాడు.

భరతునికి ప్రణమిల్లిన అప్సరసలు

అప్పుడు ఆ బాలికలు భరతునితో "ఓ మహానుభావా! మీరు రేగి చెట్లుగా ఉన్న మా నీడన చేరి నాలుగో అధ్యాయం పారాయణ చేశారు. అది విన్న కొద్ది రోజులకు మేము ఆ రూపాన్ని వదలి ఇలా బాలికలుగా మారాం అని చెప్పి ఆయనకు ప్రణమిల్లారు. ఆ తర్వాత వారు నిత్యం భగవద్గీతలోని నాలుగో అధ్యాయం పారాయణ చేసి ఆ పుణ్యఫలంతో తిరిగి అప్సరసలుగా మారి ఇంద్ర లోకం వెళ్లిపోయారు. ఇలా భగవద్గీత నాలుగో అధ్యాయాన్ని పఠించినవారు మానవులైనా, వృక్షాదులైనా దోష విఅప్పుడు సత్యతవుడు కోపించి వారిద్దరినీ గంగా తీరంలో రేగి చెట్లు కమ్మని శపించాడు. దానితో వారిరువురూ తాము తమ ప్రభువైన ఇంద్రుని ఆజ్ఞ మేరకు అక్కడకు వచ్చామని శాప విమోచనం కలిగించమని కోరారు. దానితో ఆయన శాంతించి, భరతుడనే మహనీయుడు మీ చెట్ల నీడన కూర్చుండి భగవద్గీత నాలుగో అధ్యాయం పారాయణ చేసినప్పుడు అది విని మీరు పూర్వజన్మ జ్ఞానం కలిగిన బాలికలుగా ముక్తి పొందుతారు అని పద్మ పురాణం నాలుగో అధ్యాయాన్ని పారాయణ చేసి సకల శుభాలు పొందుదాం.జై శ్రీకృష్ణ!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసి చాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

## అందరూ సమానమే అని చాటిచెప్పే 'మేల్‌మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం'- నెలసరి సమయంలోనూ అమ్మవారిని పూజించొచ్చు!





సృష్టికి మూలం ఆది పరాశక్తి. ఈ తల్లి దృష్టిలో అందరూ సమానమే! కులమత భేదాలు, స్త్రీ పురుష లింగ, వయో భేదాలు లేకుండా అందరినీ సమదృష్టితో ఆదరించే కరుణామయి. ఈ వాస్తవాన్ని అందరికీ చాటి చెప్పాలనే స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఆలయమే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం. ఎరుపు రంగు వస్త్రాలు ధరించి, నిరంతరం 'ఓం శక్తి' అంటూ అమ్మవారిని ధ్యానించే భక్తులతో ఎల్లప్పుడూ కిటకిటలాడుతుండే ఈ ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం ఎక్కడుంది?తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్పట్టు జిల్లాలో మేల్ మరువత్తూర్ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి పీఠాన్ని బంగారు అడిగళార్ అనే స్వామిజి నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఒకానొకప్పుడు ఈ క్షేత్రంలో 21 మంది సిద్ధపురుషులు జీవసమాధి పొందారట! అందుకే ఈ క్షేత్రానికి సిద్ధర్ క్షేత్రమని పేరు వచ్చింది.

### స్వయంభువుగా కొలువైన పరాశక్తి

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో ఆది పరాశక్తి సహస్రదళ పద్మంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తోంది. భక్తుల సకల మనోభీష్టాలు నెరవేర్చడంతో పాటు ఆత్మజ్ఞానాన్ని కూడా ప్రసాదించే ఈ తల్లి కులమత భేదాలకు అతీతంగా అందరినీ సమానంగా అనుగ్రహిస్తుంది. దుర్గ, పార్వతి, సరస్వతి, మహాలక్ష్మి రూపాల్లో జగన్మాత పూజలందుకుంటున్న ఈ క్షేత్రంలో ఆదిపరాశక్తి స్వయంభువుగా కొలువై ఉండడం విశేషం.

### ఆలయ స్థల పురాణం

ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు పెద్ద వేప చెట్టు ఉండేది. కొన్ని రోజులకు వేప చెట్టు నుంచి పాలు కారుతుండేవి. స్థానికులు కొంతమంది ఆ పాలను రుచి చూస్తే అవి తియ్యగా ఉన్నాయి. అంతేకాదు ఆ పాలు సేవించిన వారికి దీర్ఘకాలిక అనారోగ్యాలు సైతం నయమయ్యాయంట! ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా వ్యాపించడంతో భక్తులు తండోపతండాలుగా రావడం మొదలు పెట్టారు. వచ్చిన భక్తులు ఈ వేపచెట్టు పాలను తీర్థంగా స్వీకరిస్తూ, వేపచెట్టును పూజించడం మొదలు పెట్టారు.

### తుఫానుకు కూలిన వేపచెట్టు

కొంతకాలానికి ఒక భయంకరమైన తుఫాను వచ్చి ఈ భారీ వేప చెట్టు వేళ్లతో సహా పెకిలించు కుని రావడంతో ఆ చెట్టుకింద భూగర్భంలో ఉన్న అమ్మవారి విగ్రహం బయట పడిందట!

### బంగారు అడిగళార్

ఆ సమయంలో ఆ ప్రాంతంలో లెక్కల టీచర్?గా పనిచేస్తున్న బంగారు అడిగళార్ అనే వ్యక్తి దేవి రూపాన్ని ఆది పరాశక్తిగా గుర్తించి, ప్రతిష్ఠించి ఆరాధించి శాస్త్రోక్తంగా పీఠాన్ని స్థాపించి పూజలు ప్రారంభించారు. అప్పటి నుంచి భక్తులు దేవిని ఆరాధించడంతోపాటు బంగారు అడిగళార్?ను 'బంగారు అమ్మ' అని పిలుస్తూ భక్తితో సేవించసాగారు.

### ఆలయ విశేషాలు

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి ధ్యానానికి ప్రతీక. జగన్మాత జ్ఞానముద్రతో దర్శనమిచ్చే ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల స్థానంలో సప్తకన్నియర్ పేరుతో పరాశక్తి పరివార దేవతలైన సప్తమాతృకల ఆలయం ఉంటుంది. ఇక్కడ ఆది పరాశక్తి స్వయంభువు అయినా, గణపతి స్థపతి తయారు చేసిన దేవి విగ్రహాన్ని కూడా భక్తులు దర్శించుకుంటారు.

### అందరికీ ఒకటే దర్శనం

అమ్మవారి సమక్షంలో అందరూ సమానమే అని తెలపడానికి ఈ ఆలయంలో అందరికీ సర్వదర్శనమే ఉంటుంది. అలాగే కులమతాలతో సంబంధం లేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమ్మవారిని పూజించుకోవచ్చు.

### నెలసరి సమయంలోను పూజించవచ్చు

సాధారణంగా మహిళలు నెలసరి సమయంలో దేవతారాధనకు, పూజకు దూరంగా ఉండటం సాధారణం. కానీ ఈ ఆలయంలో మహిళలు అమ్మవారిని నెలసరి సమయంలో కూడా పూజించవచ్చు.

### పూజోత్సవాలు

మేల్ మరువత్తూర్ సిద్ధర్ ఆది పరాశక్తి ఆలయంలో ప్రతిరోజూ అభిషేకం, అర్చనలు జరుగుతాయి. ప్రతి మంగళవారం, అమావాస్య , పౌర్ణమి తిథుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

### నిత్యాన్నదానం

ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ నిత్యాన్నదానం జరుగుతుంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడ అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు ఈ దేవస్థానం ట్రస్టు తరఫున ఉచిత వైద్య సేవలు, విద్యా సేవలు నిర్వహిస్తున్నారు. మహిళలకు వృత్తి విద్యల్లో శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

### ఇరుముడి దీక్ష

స్త్రీ పురుష భేదం లేకుండా ఎరుపు వస్త్రాలు ధరించి, శక్తి మాల దీక్షాధారణతో సమర్పించే ఇరుముడి ఉత్సవం చూసి తీరాల్సిందే!

### ఎలా చేరుకోవాలి?

చెన్నై నుంచి చెంగల్పట్టు మార్గంలో ఉండే ఈ ఆలయానికి చేరుకోవడానికి మేల్ మరువత్తూర్ రైల్వే నుంచి ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు. దర్శించినంత మాత్రాన్నే అభీష్టాలు నెరవేర్చే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రాన్ని మనం కూడా దర్శించి తరిద్దాం.

### ఓం శ్రీ మాత్రే నమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

## కోపాన్ని ఆపుకోలేక పిల్లలను కొడుతున్నారా? - ఇలా ట్రై చేయండి!



పిల్లలు అల్లరి చేసినా, ఏదైనా పగలగొట్టిన లేదా పాడు చేసినా మనకు కోపం ముంచుకురావడం ఖాయం. ఒకవేళ చేసింది పెద్ద పొరపాటైతే కేవలం కోప్పడటంతో ఊరుకోకుండా ఒక దెబ్బ కూడా వేస్తాం. ఇంకొసారి అలా చేయకుండా ఉంటారని అనుకుంటాం. కానీ, పిల్లల మీద ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో అలా జరగకుండా ఉండాలంటే, ఇలా ప్రయత్నించి చూడాలని సూచిస్తున్నారు.మీ మాట వినట్లేదా? : పిల్లల్ని మనం ఒక రకంగా గాజు బొమ్మల్లానే పెంచుతాం. కాబట్టే, వాళ్లు వద్దు అని మొరాయిస్తూ ఉన్నా.. మనం మాత్రం వర్షం వస్తోంది జాకెట్ వేసుకో! చలేస్తోంది స్వెటర్ వేసుకో లేకుంటే జ్వరం, జలుబు వస్తాయని బలవంతంగా అయినా వేస్తాం. అయితే, పిల్లలు మనం చెప్పిన మాటలు వినకపోతే.. వదిలేయమంటున్నారు నిపుణులు. వర్షంలో తడిచినప్పుడో లేదా చలివేస్తున్నప్పుడో వాళ్లే మన దగ్గరకు వస్తారట. అప్పుడు చెప్పి చూడమని చెబుతున్నారు. ఎందుకంటే, పరిస్థితి అర్థమవుతుంది కదా వింటారట. అంతేకాదు, పిల్లలు చేసే పనులకు వాళ్లే పర్యవసానం అనుభవించాలనీ అర్థమవుతుందని వివరిస్తున్నారు.యువత నుంచి రాజకీయ నేతలు ఇష్టపడే "లినెన్ ఫ్యాషన్" – ఒరిజినల్ ఎలా గుర్తుపట్టాలో తెలుసుకోండి!'పావుగంట' ఫార్ములా! : కోపమొస్తే చీకటి గదిలో వేయాల్సిన పనిలేదు. ఓ మూల లేదా గదిలో ఎవరితోనూ మాట్లాడకుండా పావు గంట కూర్చోమనండి. గడువు కన్నా ముందే మాట్లాడితే సమయం పెరుగుతుందని చెప్పండి. వాళ్లలోనూ బాధ, కోపం వంటివి ఉంటాయట. అవి ఈ క్రమంలో నెమ్మదిస్తాయంటున్నారు నిపుణులు. పావుగంట పూర్తయ్యాక మీరే నెమ్మదిగా పరిస్థితిని విశ్లేషించి, అర్థమయ్యేలా చెబితే సరిపోతుందట.గోడలపై బొమ్మలు గీస్తున్నారా? : పిల్లలకి ఎన్ని పుస్తకాలైనా ఉండనీ, వారికి గోడలే కనిపిస్తాయి. ఇంకేం, ఉన్న రంగులన్నింటితో బొమ్మలు గీసేస్తారు. కోపంతో వాళ్లపై అరిచినా తుడిచే కష్టం మాత్రం మీకు తప్పదు కదా! అయితే, ఈసారి అలా పాడుచేస్తే వాళ్లనే తుడవమనండి. ఇలా చేస్తే ఇంకోసారి అలా చేయారని నిపుణులు చెబుతున్నారు.మారాం చేసే పిల్లలు : కొంతమంది పిల్లలు అన్నం తిననని మారాం చేస్తే, ఇంకొందరు ప్లేటు తోసేస్తారు. ఇలాంటప్పుడు వాళ్లతోనే నేల, టేబుల్ శుభ్రం చేయించాలంటున్నారు నిపుణులు. ఆ పూటకి బతిమాలి అన్నం పెట్టొద్దని చెబుతున్నారు. వారికి ఆకలిగా అనిపించినప్పుడు వాళ్లే అడుగుతారని తెలియజేస్తున్నారు. అలాగే, బొమ్మ విరగ్గొడితే వెంటనే కొనివ్వడం లాంటివి చేయొద్దట. ఏదైనా పని అప్పగించి, దాన్ని పూర్తి చేస్తేనే కొనివ్వాలని వివరిస్తున్నారు. అయితే, వయసుకి తగ్గవే ఇవ్వాలని తెలియజేస్తున్నారు. కొట్టకుండా, కోప్పడకుండా : టీవీ సమయంలో కోత వేయడం, పిల్లలకు నచ్చిన బొమ్మని మీ అధీనంలో ఉంచుకోవడం ఇలాంటి శిక్షలు వేయొచ్చుంటున్నారు నిపుణులు. మళ్లీ వాళ్ల ప్రవర్తన బాగుంటేనే ఇస్తానని చెప్పమని చేస్తే, ఇంకొందరు ప్లేటు తోసేస్తారు. ఇలాంటప్పుడు వాళ్లతోనే నేల, టేబుల్ శుభ్రం చెబుతున్నారు. ఇవీ వాళ్లలో సానుకూల మార్పునే తెస్తాయట. అయితే, పిల్లలు చేసిన పొరపాటును బట్టి ఇలాంటి శిక్షణని ప్లాన్ చేయామని సూచిస్తున్నారు. మీరు కోరుకునేదీ వాళ్లలో మార్పునే కదా! దానికి దీర్ఘకాలం వాళ్లపై ప్రభావం చూపే కోప్పడటం, కొట్టడం వంటివే అవసరం లేదని సలహా ఇస్తున్నారు. ఆలోచన రేకెత్తించే ఇలాంటివీ ప్రయత్నించొచ్చని పేర్కొంటున్నారు.

## వర్షాకాలంలో గ్యాడ్జెట్స్ దెబ్బతినకుండా!




వర్షాకాలంలో తేమ, వర్షపు నీరు కారణంగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. మొబైల్స్, ల్యాప్?టాప్, టీవీ, కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో తేమ చేరితే సర్క్యూట్ బోర్డులపై ప్రభావం పడుతుందంటున్నారు నిపుణులు. దీంతో షార్ట్ సర్క్యూట్లు జరిగే ప్రమాదం ఉందట. ఈ క్రమంలో వర్షాకాలంలో గ్యాడ్జెట్స్ పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!వానాకాలంలో తేమ అధికం : వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో మొబైల్స్, ల్యాప్?టాప్, టీవీ, కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో తేమ చేరే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. దీనివల్ల సర్క్యూట్ బోర్డులపై ప్రభావం పడుతుందట. అలాగే, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు హై వోల్టేజ్ వంటివి కూడా గ్యాడ్జెట్స్?ను ఎఫెక్ట్ చేస్తాయని చెబుతున్నారు. ఒకవేళ వర్షంలో తడిసినప్పుడు గ్యాడ్జెట్లలోకి నీరు చేరితే కాంపోనెంట్స్ తుప్పు పట్టడం, షార్ట్ సర్క్యూట్ అవ్వడం లాంటివి కూడా జరుగుతాయని తెలియజేస్తున్నారు.

ధ్యానంతో దంపతుల మధ్య అనుబంధం! – రోజుకు 10 నిమిషాల పాటు ఇలా చేయండిఎలా జాగ్రత్త పడాలి? : ఒకవేళ స్మార్ట్?ఫోన్స్, ల్యాప్?టాప్??లను బయటకు తీసుకెళ్లే వాటర్ ప్రూఫ్ బ్యాగ్ లేదా కవర్?లో ఉంచాలని చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తడిసిన చేతులతో డివైస్లను ముట్టుకోవద్దని హెచ్చరిస్తున్నారు. తడిగా ఉన్నప్పుడు ఫోన్, ల్యాప్?టాప్?, కెమెరా, బ్యాటరీ ఇలా దేనికి కూడా ఛార్జింగ్ పెట్టొద్దని సూచిస్తున్నారు. వాటిని పూర్తిగా ఆరనిచ్చిన తర్వాతే ఉపయోగించడం లేదా ఛార్జింగ్ పెట్టాలని తెలియజేస్తున్నారు. అయితే, తర్వగా డ్రై అవ్వడానికి హెయిర్ డ్రయర్ వంటివి వాడకూడదని అంటున్నారు. అవసరమైతే సర్వీస్ సెంటర్?కు తీసుకెళ్లడం మంచిదని పేర్కొంటున్నారు.ంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లకు సర్చ్ ప్రొటెక్టర్ యూపీఎస్ లాంటివి ఉపయోగించాలని సూచిస్తున్నారు. భారీగా ఉరుములు వస్తున్నప్పుడు కుదిరితే ప్లగ్స్ తీసేయడం ఇంకా మంచిదని సలహా ఇస్తున్నారు. అలాంటి సమయంలో ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్ వాడకపోవడమే మేలట.

శుభ్రం చేసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి : ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్?ను ఎప్పుటికప్పుడు పొడి, మృదువైన క్లాత్?తో శుభ్రం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వెంటిలేషన్ భాగాల్లో దుమ్ము, తేమ, పేరుకుపోకుండా చూసుకోవాలని చెబుతున్నారు. వీలైతే ప్రతి మూడు నాలుగు రోజులకు ఒకసారి క్లీన్ చేయాలని అంటున్నారు. ఉపయోగించకుండా ఇంట్లో పాటించాల్సిన జాగ్రత్తలు : ఎలక్ట్రానిక్ పరికరాలను పొడి ప్రదేశంలోనే ఉంచాలట. కిటికి, మెయిన్ డోర్స్ ఇలా వర్షం నీరు వచ్చే ప్రదేశాల దగ్గర ఉంచకూడదని నిపుణులు చెబుతున్నారు. గదిలో గాలి సరిగా ఆడుతుందో లేదో చెక్ చేసుకోవాలంటున్నారు. ఎందుకంటే, వానాకాలంలో ఉరుములు, మెరుపులు, విద్యుత్ అంతరాయాలు ఎక్కువ ఉంటాయని తెలియజేస్తున్నారు. అందుకే, టీవీ, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లకు సర్చ్ ప్రొటెక్టర్ యూపీఎస్ లాంటివి ఉపయోగించాలని సూచిస్తున్నారు. భారీగా ఉరుములు వస్తున్నప్పుడు కుదిరితే ప్లగ్స్ తీసేయడం ఇంకా మంచిదని సలహా ఇస్తున్నారు. అలాంటి సమయంలో ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్ వాడకపోవడమే మూడు నాలుగు రోజులకు ఒకసారి క్లీన్ మేలట.

శుభ్రం చేసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి : ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్?ను ఎప్పుటికప్పుడు పొడి, మృదువైన క్లాత్?తో శుభ్రం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వెంటిలేషన్ భాగాల్లో దుమ్ము, తేమ, పేరుకుపోకుండా చూసుకోవాలని చెబుతున్నారు. వీలైతే ప్రతి మూడు నాలుగు రోజులకు ఒకసారి క్లీన్ చేయాలని అంటున్నారు. ఉపయోగించకుండా ఖాళీగా పెట్టిన కెమెరా, ల్యాప్?టాప్?, ఇతర గ్యాడ్జెట్లను పొడి ప్రదేశంలో ఉంచాలని తెలియజేస్తున్నారు. తేమను తగ్గించడంలో సిలికా జెల్? ప్యాకెట్లు ఉపయోగకరంగా ఉంటాయట.

# కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

- 38వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ తాటికొండ బుగ్గ రాముడు
- శ్రీ వెంకటేశ్వర నాటక మండలి కళాకారులకు ఆర్థిక సాయం




**నంద్యాల, జూలై 26:**తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న రీడింగ్ విక్టోరియా రూమ్ నందు 'శ్రీ వెంకటేశ్వర నాటక మండలి' ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 38వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ తాటికొండ బుగ్గ రాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నాటక రంగాన్ని బ్రతికించుకుంటున్న కళాకారుల సేవలను కొనియాడారు. అనంతరం కళాకారులకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుగ్గ రాముడు చూపిన ఉదారతకు కృతజ్ఞతగా నాటక మండలి సభ్యులు, కళాకారులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటక కళాకారులు చెన్నంపల్లి సూరి, శివరామిరెడ్డి, మధుతో పాటు పలువురు కళాకారులు, స్థానిక ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# థాయిలాండ్ ఇంటర్న్ షిప్‌కు ఆర్జీఎం విద్యార్థుల ఎంపిక..!





**పాణ్యం,జూలై 26:** మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు థాయిలాండ్ లోని ఏఐటి ప్రతిష్టాత్మక ఇంటర్న్ షిప్ కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏఐసిటిఈ ఎడ్యు సిల్వ్ సంయుక్తంగా నిర్వహించిన కఠినమైన ఎంపిక ప్రక్రియలో నెగ్గి గ్రామీణ నేపథ్యం ఉన్న ఆరు మంది ప్రతిభావంతులైన విద్యార్థులు జి.మహేంద్ర నాథ్ రెడ్డి (సిఎస్సి), ఎస్ అబ్దుల్ కలాం (సివిల్) ఎస్.మెహేక్ అంజుమ్ (ఈ సిఈ), జి.నిత్యశ్రీ (సిఎస్ఈ డేటా సైన్స్), ఎం అమర్ (సి ఎస్ఈ, ఏఐఎంఎల్), సోముల నాగవర్ధన్ రెడ్డి(మెకానికల్)లో థాయిలాండ్ లోని బ్యాంకాక్ లో గల ప్రపంచ ప్రఖ్యాత ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏఐటి) లో ఇంటర్న్ షిప్ కు ఎంపికయ్యారన్నారు. ఈ అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం ఈనెల 27 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ఎంతో కీలకమవుతుందన్నారు. ఏఐటి శిక్షణ ద్వారా విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా గ్లోబల్ ప్రాజెక్టులు, లైవ్ వర్కింగ్ ఎన్విరాన్మెంట్ పై ప్రత్యక్ష అనుభవాన్ని సాధిస్తారన్నారు. అత్యాధునిక సాంకేతికతలపై పట్టు సాధిస్తారన్నారు. ఉత్తమ ఉద్యోగ అవకాశాలు పొందడమే గాక సాఫ్ట్ సిల్క్స్ సంస్కృతులపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.శాంతి రాముడు, ఎండి శివరాం,కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్, హెచ్ ఓ డి డాక్టర్ సుబ్బారెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

# నంద్యాలలో జూలై 30న మెగా జాబ్ మేళా

- 16 ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, జూలై 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గంలోని పీఎస్సీ & కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాలలో ఈ నెల జూలై 30న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో మెగా జాబ్ మేళా, ఇండియా స్కిల్స్ కాంపిటీషన్స్ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ సోమ శివారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాలో 16 ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు. స్నైడర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్, పిట్టి ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఏథర్, కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హిల్టన్ టొబాకో ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, టాటా ఎలక్ట్రానిక్స్, ముత్తూట్ మైక్రోఫిన్, అల్లైడ్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్, ఎల్ అండ్ టీ కన్స్ట్రక్షన్, పసిఫిక్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎస్‌కే బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్, సుజల పైప్స్, హెటెరో ల్యాబ్స్, ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనడానికి అర్హులని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను పొందాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9182217075, 8297812530 నంబర్లను సంప్రదించవచ్చని, అలాగే naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చని తెలిపారు.

# పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**మహానంది రోడ్డులోని 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా**

**ప్లాంట్ నిర్వహణ, శుద్ధీకరణ ప్రక్రియలను నిశితంగా పరిశీలించిన మంత్రి, కలెక్టర్**




**నంద్యాల, జూలై 26 :**నంద్యాల పట్టణ ప్రజల ఆరోగ్య భద్రత, నాణ్యమైన తాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని . ఇందులో భాగంగా సోమవారం నంద్యాల మహానంది రోడ్డులో గల అమృత్ పథకం కింద నిర్మించిన 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖామాత్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా మంత్రి మరియు కలెక్టర్ ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించారు. నీటి శుద్ధీకరణ (ఫిల్ట్రేషన్) ప్రక్రియ జరుగుతున్న తీరును, క్లోరినేషన్ విధానాన్ని మరియు ప్లాంట్ నిర్వహణ రిజిస్టర్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పూర్తిగా స్వచ్ఛంగా, సురక్షితంగా ఉండేలా ప్రతిరోజూ ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. శుద్ధీకరణ కేంద్రం ప్రాంగణంతో పాటు నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, ఎక్కడా కాలుష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల నుండి వచ్చే నీటి సమస్యల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వో శ్రీనివాసులు, గుర్రప్ప, ప్రజారోగ్య మరియు పురపాలక సాంకేతిక శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అబాండం తాండాలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా 'డోర్ టు డోర్' ప్రచారం

**ఇంటింటికీ తిరిగి సంక్షేమ, అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేసిన మంత్రి ఫరూక్**

**ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించిన మంత్రి ఫరూక్**




**నంద్యాల, జూలై 26:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నంద్యాల నియోజకవర్గ పరిధిలోని అబాండం తాండా నందు సోమవారం భారీ ఎత్తున 'డోర్ టు డోర్' (ఇంటింటికీ) ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేతృత్వంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ తాండాలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్ళి, అక్కడి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అపూర్వ సంక్షేమ విజయాలు, మౌలిక వసతుల కల్పన మరియు అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. కరపత్రంలో పొందుపరిచిన విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సూపర్ సిక్స్ హామీలు మరియు రాయలసీమ ప్రగతి ప్రాజెక్టులను మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అర్హులకు నెలనెలా రూ. 4,000 నుండి రూ. 15,000 వరకు పంపిణీ చేస్తున్నామన్నారు. తల్లికి వందనం మరియు దీపం-2 పథకాలు ఇంట్లో ప్రతి విద్యార్థికి రూ. 15,000 మరియు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తున్నామన్నారు. ఉపాధి మరియు నియామకాలు మెగా డీఎస్సీ ద్వారా 16,000 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని అలాగే 6,000 పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. రాయలసీమ ప్రగతి సీమ సాగునీటి ప్రాజెక్టుల కొరకు రూ. 12,484 కోట్లు, కర్నూలులో డ్రోన్ సిటీ, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్, కడపలో స్టీల్ ప్లాంట్ మరియు నంద్యాల-కర్నూలు జిల్లాల్లో సోలార్, విండ్ పరిశ్రమల స్థాపన జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు . రాయలసీమ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, సాగునీటి పరంగా అభివృద్ధి చేసేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామన్నారు . గత రెండేళ్లలో నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా కోట్ల రూపాయలతో రహదారులు, తాగునీరు, పారిశుధ్య పనులను చేపట్టాం అని తెలిపారు . ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా తమ ఇళ్లకు అందుతుండటం పట్ల అబాండం తాండా వాసులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి ఫరూక్ కి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, స్వామి నాయక్, రమేష్ నాయక్, కొట్టాల శివ నాగిరెడ్డి , ప్రేమ్ నాథ్ రెడ్డి, మునియార్ ఖలీల్ , మునగాల విశ్వనాథ్ రెడ్డి , ఉప్పరి సురేష్ కుమార్, మిద్దె ఉసేని , గోవింద నాయుడు మరియు స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో నంద్యాల ప్రగతి పథం

**రూ. 211.92 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా**




**నంద్యాల, జూలై 26:** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. నంద్యాల పురపాలక సంఘం పరిధిలో ప్రజారోగ్య మరియు పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో అమృత్ 2.0 (అమృత 2.0) పథకం కింద రూ. 211.92 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖామాత్యులు ఎన్ఎండి ఫరూఖ్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి లు శంకుస్థాపనలు మరియు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన చేసిన ముఖ్యమైన ప్రాజెక్టుల వివరాలు:1. 32.0 మీణ మురుగు నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నిర్మాణం:నంద్యాల పట్టణంలో పారిశుధ్యం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో రూ. 169.67 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 32.0 ఎం.ఎల్.డి మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ పనులకు మంత్రి ఫరూక్ భూమిపూజ చేశారు. 2. చిన్న చెరువు పునరుజ్జీవనం:పట్టణ పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా రూ. 3.50 కోట్ల అంచనా వ్యయంతో చిన్న చెరువు పునరుజ్జీవన పనులకు భూమిపూజ నిర్వహించారు. 3 . సమగ్ర నీటి సరఫరా అభివృద్ధి పథకం:పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ. 38.75 కోట్ల అంచనా విలువతో చేపట్టనున్న సమగ్ర నీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నంద్యాల పట్టణ రూపురేఖలను మార్చే విధంగా ఈ భారీ ప్రాజెక్టులను నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. నంద్యాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిరంతరం నిధుల కేటాయింపుతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన ఈ నిధులతో నంద్యాల పట్టణంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించామని తెలిపారు. ఈ భూమిపూజ మరియు శంకుస్థాపన మహోత్సవంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మునియార్ ఖలీల్, ఎమ్మార్వో శ్రీనివాసులు, గుర్రప్ప, కొట్టాల శివ నాగిరెడ్డి , మునగాల విశ్వనాథ్ రెడ్డి, పబ్బతి వేణు , స్వామి నాయక్ , గోవింద నాయుడు, బుగ్గ రాముడు , మిద్దె ఉసేని, చలం బాబు , ఉప్పరి సురేష్ కుమార్ , పల్లె వెంకటసుబ్బయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు ప్రాధాన్యం

- సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించి ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించి సమస్యలను అడిగి తెలుస ుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసత ులు, సామాజిక భద్రతకు సంబంధించిన అనేక సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపిస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర సమీక్ష నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల వినతులు పెండింగ్‌లో ఉండకుండా ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెరిగితే ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ ఫలితాలు కనిపించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.

# ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం

- 410 దరఖాస్తుల స్వీకరణ
- ఔట్‌సోర్స్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



**జనగామ, జూలై 27 :** ప్రజావాణికి వచ్చే అర్జీలను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోంతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 410 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఔట్‌సోర్స్ ఉద్యోగుల వేతనాలపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఔట్‌సోర్స్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందేలా అన్ని శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేతనాల చెల్లింపులో ఆలస్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో ఔట్‌సోర్స్ ఉద్యోగుల నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగుల నియామకాలు, వివరాల నిర్వహణ, హాజరు నమోదు, వేతన బిల్లుల తయారీ, చెల్లింపుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ విధానం ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలోని ఔట్‌సోర్స్ ఉద్యోగుల వేతన బిల్లులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్థిక, పరిపాలనా కారణాలతో ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజావాణి అర్జీల పరిష్కారం, ఔట్‌సోర్స్ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు.

# ప్రజావాణి అర్జీలపై కలెక్టర్ ఆదేశం

- 52 ఫిర్యాదులు స్వీకరణ
- పెండింగ్ లేకుండా పరిష్కారానికి సూచన
- అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**గద్వాల్, జూలై 27 :** ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని గద్వాల్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, శిక్షణ ఉప కలెక్టర్ రాజ్‌కుమార్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ వారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 52 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించారని పేర్కొన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పూర్తిస్థాయిలో పరిష్కారం కాని అర్జీలను గుర్తించి వాటిని ఆలస్యం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని కలెక్టర్ అన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మరోసారి స్పష్టం చేశారు.

# విత్తన మేళాకు శ్రీకారం

- రైతులతో మమేకమైన కార్యదర్శి
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు
- నీటి సంరక్షణకు ప్రాధాన్యం




**రంగారెడ్డి, జూలై 27 :** వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్ ఫరూక్‌నగర్ మండలం వెల్జెర్ల గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించి రైతులతో ముచ్చటించారు. నాణ్యమైన విత్తనాల వినియోగంతో మెరుగైన దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. అనంతరం కంది--మొక్కజొన్న అంతరపంట సాగు చేస్తున్న రైతు పొలాన్ని సందర్శించి పంట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతరపంటల సాగు వల్ల రైతులకు ఆదాయ భద్రతతో పాటు వాతావరణ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటల ఎంపికలో స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే కంది, పెసర, మినుము, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కె. సురేంద్రమోహన్ సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. నీటి వసతి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. అలాగే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను వినియోగించుకుని తమ ఉత్పత్తులకు అదనపు విలువను సృష్టించుకోవాలని కోరారు.

వ్యవసాయంలో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటూ ఇంకుడు గుంతలు వంటి నీటి సంరక్షణ పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. వర్షపు నీటిని సమర్థంగా నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కె. సురేంద్రమోహన్ ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# పెద్ది సుదర్శన్‌ను పరామర్శించిన కేటీఆర్



- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆస్పత్రి సందర్శన
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నేతలు
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేటీఆర్
- మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 27 :** సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవల వివరాలను పరి శీలించారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు ఆస్పత్రిని సందర్శించారు. అనం తరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఇప్ప టివరకు అందించిన చికిత్సకు సంబంధించిన వివరాలను వైద్యులు కేటీఆర్‌కు వివరించారు. ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర ్యవేక్షిస్తున్నామని, అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నామని వైద్య బృందం తెలిపింది. పెద్ది సుదర్శన్ రెడ్డికి అత్యుత్తమ వైద్యం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని కేటీఆర్ వైద్యులను కోరారు. చికిత్సలో ఎలాంటి లోటు లేకుండా అవసరమైన సదుపాయాలన్నీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో బీఆర్ ఎస్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

# నోరు, దంతాల సమస్యలు ఉన్నవారు వీటిని ఉపయోగించండి..



మన నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి అద్దం పడుతుంది. దంతాలు బలహీనపడటం, పిప్పి దంతాలు, దంతాలపై మరకలు, దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చల్లని లేదా వేడి ఆహారం తిన్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా నొప్పి లేదా జలదరింపు అనిపించడం దంతాల సున్నితత్వానికి సంకేతం. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలను పాటించడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అమ్లం (ఆసిడిటీ) ఎక్కువగా ఉండే ఆహారాలు, పానీయాలను అధికంగా తీసుకోవడం తగ్గించాలి. ఇవి దంతాలపై ఉండే ఎనామెల్‌ను క్రమంగా దెబ్బతీసి సున్నితత్వాన్ని పెంచే అవకాశం ఉంటుంది. అలాగే ఇలాంటి ఆహారం తీసుకున్న వెంటనే కాకుండా కనీసం 20 నిమిషాల తర్వాత దంతాలను తోమడం మంచిది. గ్యాస్ట్రిక్ సమస్యలు లేదా యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడేవారు వాటికి సరైన చికిత్స తీసుకోవాలి. కడుపులోని ఆమ్లం తరచూ నోటిలోకి రావడం వల్ల దంతాలలోని ఖనిజాలు తగ్గి, ఎనామెల్ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో దంతాల సున్నితత్వం మరింత పెరుగుతుంది.

గ్రీన్ టీ..గ్రీన్ టీ తాగడం కూడా దంతాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రీన్ టీలో ఉండే కొన్ని సమ్మేళనాలు దంతాల సున్నితత్వాన్ని తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలోని పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడంలో సహాయపడి, బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో తోడ్పడుతుంది. దంతాలను తెల్లగా మార్చే (టీత్ వైటెనింగ్) ఉత్పత్తులు లేదా ఆల్కహాల్ అధికంగా ఉండే మౌత్‌వాష్‌లను తరచూ ఉపయోగించడం తగ్గించాలి. ఇవి కొందరిలో దంతాల సున్నితత్వాన్ని మరింత పెంచే అవకాశం ఉంటుంది. అవసరమైతే సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిది.

లవంగాలు..

లవంగం లేదా లవంగ నూనె కూడా దంతాల సున్నితత్వం వల్ల వచ్చే అసౌకర్యాన్ని తాత్కాలికంగా తగ్గించడంలో ఉపయోగపడుతుంది. లవంగంలో ఉండే సహజ సమ్మేళనాలు నొప్పిని తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. దంతాల సున్నితత్వం తరచూ వేధిస్తుంటే లేదా నొప్పి ఎక్కువగా ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా దంత వైద్యుడిని సంప్రదించడం అవసరం. సరైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రమవకుండా నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు

# పిల్లలకు వారానికి ఒక్కసారైనా చేపలను తినిపించాలి..



చేపలను వారానికి కనీసం ఒక్కసారైనా తినే పిల్లల్లో మేధో సామర్థ్యం మెరుగ్గా ఉండటంతోపాటు మంచి నిద్ర కూడా లభిస్తుందని ఓ అధ్యయనం వెల్లడించింది. పిల్లల మెదడు అభివృద్ధిలో సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఆహారాలను చిన్నప్పటి నుంచే అలవాటు చేయడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. జర్నల్ సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. వారానికి కనీసం ఒకసారి చేపలు తినే పిల్లలు ఐక్యూ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించే అవకాశముందని గుర్తించారు. అలాగే చేపలను ఎక్కువగా తినే పిల్లల్లో నిద్ర సంబంధిత సమస్యలు కూడా తక్కువగా కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. చేపల వినియోగం నిద్ర నాణ్యతను మెరుగుపరచడం ద్వారా మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపిస్తుందని అధ్యయనం సూచిస్తోంది.

మెదడు అభివృద్ధికి..చేపలతోపాటు కొన్ని ఇతర ఆహారాలు కూడా పిల్లల మెదడు అభివృద్ధికి తోడ్పడతాయి. గింజలు, నట్స్‌లో మెదడు ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా గుమ్మడికాయ గింజల్లో ఉండే జింక్ జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అక్రోట్స్‌లో ఉండే ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు మెదడు పనితీరును సమర్థవంతంగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు వంటి బెర్రీ పండ్లు కూడా మెదడు పనితీరును మెరుగుపరచడంలో ఉపయోగపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చడం వల్ల పిల్లల ఆలోచనా సామర్థ్యం, జ్ఞాపకశక్తి మెరుగుపడే అవకాశం ఉంటుంది. ఆకుకూరలు కూడా..

ఆకుకూరలు పిల్లలకు అంతగా నచ్చకపోయినా, వాటితో రుచికరమైన వంటకాలు తయారు చేసి ఆహారంలో చేర్చడం మంచిది. వీటిలో ఉండే ఐరన్, విటమిన్ ఇ, విటమిన్ కె, విటమిన్ అవసరమవుతాయి.

# సరికొత్త ఓపెనర్స్‌తో బరిలోకి టీమిండియా..?




భారత క్రికెట్ వర్గాల్లో పదిహేనేళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. జింబాబ్వే టూర్‌లో అదరగొట్టిన ఈ టీనేజ్ సెన్సేషన్‌ను 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దించాలని మాజీ దిగ్గజం ఫరూఖ్ ఇంజనీర్ సంచలన సూచన చేశారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెంటనే ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేయడం ఆసక్తికరంగా మారింది.వన్డే ప్రపంచకప్ 2027 టార్గెట్‌గా టీమిండియా సన్నాహాలు మొదలుపెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఫరూఖ్ ఇంజనీర్ చేసిన వ్యాఖ్యలు జాతీయ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం భారత వన్డే జట్టులో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఇన్నింగ్స్ ఆరంభిస్తున్నారు. అయితే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ వ్యూహాన్ని మార్చాలని ఆయన సూచించారు. గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మాట వాస్తవమే అయినా.. అతడిని నాలుగో స్థానంలో ఆడిస్తే జట్టుకు మరింత మేలు జరుగుతుందన్నది ఫరూఖ్ అభిప్రాయం. గిల్ గాల్లోకి లేపి భారీ షాట్లు ఆడే రకం కాదు.. అతడో పక్కా క్లాస్ ప్లేయర్ కాబట్టి అతనికి మిడిలార్డర్ బాధ్యతలు అప్పగించాలన్నారు.అదే జరిగితే కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. మైదానంలో ఈ లెఫ్ట్-రైట్ కాంబినేషన్ అద్భుతంగా వర్కవుట్ అవుతుందని ఆయన విశ్లేషించారు. వైభవ్ లాంటి దూకుడున్న ఆటగాడు పవర్‌ప్లేలో ఫీల్డింగ్ గ్యాప్స్ సునాయాసంగా కనుక్కుని బౌండరీలు బాదగలడు. అతడు ఆరంభంలోనే వేగంగా పరుగులు రాబడితే.. మిగతా బ్యాటర్లు కుదురుకుని భారీ లక్ష్యాలను నిర్దేశించడానికి పుష్కలంగా సమయం దొరుకుతుంది.ఫరూఖ్ సూచించిన కొత్త బ్యాటింగ్ లైనప్ ప్రకారం.. రోహిత్, సూర్యవంశీ ఓపెనింగ్ చేస్తే.. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తనకిష్టమైన మూడో స్థానంలోనే వస్తాడు. ఆ తర్వాత నాలుగో నంబర్‌లో శుభ్‌మన్ గిల్ వస్తే టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ అత్యంత పటిష్ఠంగా మారుతుంది. పటిష్ఠమైన బేస్ ఏర్పడ్డాక మిడిలార్డర్‌లో గిల్ లాంటి సాంకేతిక నైపుణ్యం ఉన్న బ్యాటర్ ఉంటే జట్టుకు తిరుగుండదని ఫరూఖ్ అంచనా వేస్తున్నారు.ఇటీవలే జింబాబ్వేతో ముగిసిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వైభవ్ ఏ స్థాయిలో చెలరేగాడో అందరం చూశాం. రెండు అద్భుతమైన హాఫ్ సెంచరీలు సాధించి మొత్తం 151 పరుగులు ఖాతాలో వేసుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సైతం సొంతం చేసుకుని సెలెక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించాడు. ఇలాంటి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కుర్రాడిని వెంటనే వన్డే జట్టులోకి తీసుకోవడానికి ఇదే సరైన తరుణమని మాజీ వికెట్ కీపర్ గట్టిగా చెబుతున్నారు. అతడి వయసు కేవలం 15 ఏళ్లే అయినా.. జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌లు గెలిపించేంత ఆత్మవిశ్వాసం ఆ కుర్రాడిలో పుష్కలంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. వన్డేలు, టీ20ల మధ్య పెద్దగా తేడా చూడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ.. అతడిని క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్‌తో పోల్చారు. రిచర్డ్స్ ఏ ఫార్మాట్లో ఆడినా బౌలర్లపై విరుచుకుపడేవాడు.. అచ్చం అలాగే వైభవ్ కూడా ఒక జీనియస్ అని కొనియాడారు. షార్ట్ పిచ్ బంతులు పడితే వాటిని కచ్చితంగా సిక్సర్లుగా మలిచే సత్తా ఈ కుర్రాడి సొంతం. అయితే అతడికి అతిగా కోచింగ్ ఇచ్చి సహజ సిద్ధమైన శైలిని నాశనం చేయొద్దని బీసీసీఐకి సూచించారు. పుస్తకాల్లో ఉన్నట్లు కాకుండా తనదైన శైలిలో ఆడే ఈ కుర్రాడికి పదే పదే సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ తనను తాను మెరుగుపరుచుకునే లక్షణం అతడిలో ఉందని ప్రశంసించారు.

# వైభవ్ సూర్యవంశీపై వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు



జింబాబ్వేతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 49 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టు ఘనవిజయంలో కీలక పాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ గెలుచుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను కూడా కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం భారత తాత్కాలిక ప్రధాన కోచ్ వివిఎస్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం 15 సంవత్సరాల వయస్సులోనే వైభవ్ చూపుతున్న ఆత్మవిశ్వాసం, పరిణతి అద్భుతమని కొనియాడిన లక్ష్మణ్, భవిష్యత్తులో అతను మరింత ఎదగడానికి ఓ కీలకమైన సలహా ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభను బీసీసీఐ రెండున్నర సంవత్సరాల క్రితమే గుర్తించిందని లక్ష్మణ్ వెల్లడించారు. 2024 అండర్-19 ప్రపంచ కప్‌కు ముందు విజయవాడలో జరిగిన క్వాడ్రాంగ్యులర్ సిరీస్‌లో ఇండియా-బి తరఫున వైభవ్ అత్యధిక పరుగులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచే అతనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తూ, అండర్-19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. వైభవ్ ఒక ఆటగాడిగానే కాకుండా వ్యక్తిగతంగా ఎలాంటి ఆలోచనా ధోరణి కలిగి ఉంటాడో మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా తెలుసని లక్ష్మణ్ చెప్పారు. గత ఆరు నెలల కాలంలో వైభవ్ వ్యక్తిగతంగా ఎదిగిన తీరు, ఆటపై అతనికి ఉన్న అవగాహన, మెచ్యూరిటీ లెవల్స్ ఆకాశాన్ని తాకాయని లక్ష్మణ్ ప్రశంసించారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద బౌలర్లను ఎదుర్కొంటూ ఒత్తిడి సమయాల్లోనూ రాణించగలుగుతున్నాడని చెప్పారు. అయితే వైభవ్ ఇంకా చాలా మెరుగుపడాల్సిన ఏకైక ప్రధాన అంశం అతని ఓవరాల్ ఫిట్‌నెస్ అని లక్ష్మణ్ స్పష్టం చేశారు. అతను ఇంకా 15 ఏళ్ల చిన్న కుర్రాడేనని, రాబోయే రోజుల్లో తన ఫిట్‌నెస్ స్థాయిలను పెంచుకుంటే క్రికెట్ ప్రపంచంలో తిరుగులేని ప్లేయర్‌గా మారతాడని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.ఆటలోని ప్రతి విభాగంలోనూ తానను తాను మెరుగుపరుచుకోవాలనే తపన వైభవ్‌లో స్పష్టంగా కనిపిస్తుందని కోచ్ లక్ష్మణ్ కొనియాడారు. మూడో టీ20 మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దెబ్బ తగిలి గాయపడినప్పటికీ, మైదానాన్ని వదిలి వెళ్లకుండా జట్టు కోసం ఫీల్డింగ్ కొనసాగించాలని వైభవ్ భావించాడని తెలిపారు. కానీ జట్టు ఫిజియో వచ్చి బలవంతంగా అతనిని బయటకు తీసుకువెళ్లారని చెప్పారు. చిన్న వయసులోనే జట్టు విజయం కోసం అతను చూపించిన ఈ అంకితభావం, పట్టుదల నిజంగా అభినందనీయమని లక్ష్మణ్ ప్రశంసించారు.

# ఆకట్టుకోలేకపోయిన బాబర్ ఆజం

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆట ముగిసేసరికి పాకిస్థాన్ 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజం 23 పరుగులకు ఔటవ్వగా.. షాన్ మసూద్ 88 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాదాపు మూడేళ్ల విరామం అనంతరం టెస్ట్ క్రికెట్లో పాక్ కెప్టెన్‌గా తిరిగొచ్చిన బాబర్ ఆజం.. బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టు రెండో రోజు ఆటలో బాబర్ ఆజం కేవలం 23 పరుగులకే ఔటయ్యాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్థాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి.. ఆతిథ్య జట్టు కంటే ఇంకా 112 పరుగుల వెనుకబడి ఉంది.జులై 2023 తర్వాత తొలిసారిగా టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజం క్రీజులో మంచి ఫామ్ లో కనిపించాడు. బాబర్ ఆజం తన 38 బంతుల ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు కొట్టాడు. కానీ వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. బాబర్ ఆజం తన చివరి టెస్ట్ సెంచరీని దాదాపు నాలుగేళ్ల క్రితం కరాచీలో న్యూజిలాండ్‌పై సాధించాడు. బాబర్ ఆజం ఇప్పటివరకు 63 టెస్ట్ మ్యాచ్‌లలో 42.49 సగటుతో



4504 పరుగులు సాధించాడు, ఇందులో తొమ్మిది సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కెమర్ రోచ్ బౌలింగ్‌లో ఓపెనర్ అజాన్ ఒవైస్ డకౌట్ అవ్వడంతో పాకిస్థాన్‌కు పేలవమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత మాజీ కెప్టెన్ షాన్ మసూద్, ఇమామ్-ఉల్-హక్(63) రెండో వికెట్‌కు అద్భుతమైన 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షాన్ మసూద్ 137 బంతుల్లో 11 ఫోర్లతో 88 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా.. అప్పుడే క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ సల్మాన్ అఘా ఇంకా తన ఖాతా తెరవలేదు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 311 పరుగుల వద్ద ముగిసింది. వికెట్ కీపర్ షాయ్ హోప్ (92 పరుగులు), కావెమ్ హాడ్జ్ (84 పరుగులు) జట్టును బలమైన స్కోరుకు చేర్చారు. పాకిస్థాన్ తరఫున ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ అలీ అద్భుతంగా బౌలింగ్ చేసి 50 పరుగులకు 4 వికెట్లు తీయగా.. మహమ్మద్ అబ్బాస్ 63 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు.




# వెయిట్ లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్‌కు రజతం

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ ఖాతాలో ఐదో పతకం చేసింది. వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం జరిగిన మహిళల 53 కేజీల విభాగం వెయిట్‌లిఫ్టింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జ్ఞానేశ్వరికి రజతం దక్కింది. ఈ పోటీలో తొలి స్థానంలో నిలిచిన ఒనోమి ఒమోలోల (నైజీరియా) గోల్డ్ ముద్దాడగా, రెబెక (కెనడా)కు కాంస్యం దక్కింది. ఈ పోటీలో జ్ఞానేశ్వరీ అద్భుత పోరాట పటిమ కనబర్చింది. అయితే కేవలం 7 పాయింట్ల తేడాతో ఆమె స్వర్ణం మిస్ అయ్యింది. స్నాచ్‌లో తొలి రెండు ప్రయత్నాల్లో 82, 85 కేజీల బరువు ఎత్తిని యాదవ్ మూడో ప్రయత్నంలో సక్సెస్‌ఫుల్‌గా 88 కేజీలు ఎత్తింది. ఇక క్లీన్ అండ్ జెర్క్‌లో తొలి రెండుసార్లు 103, 105 కేజీలు ఎత్తగా, చివరి ప్రయత్నంలో 111 కేజీలు బరువుతో సత్తా చాటింది. దీంతో మొత్తం 199 కేజీలతో జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచింది. ఇదే పోటీలో నైజీరియా వెయిట్ లిఫ్టర్ ఒనమి ఒనోమోల స్నాచ్‌లో ఏకంగా 93 కేజీలు ఎత్తింది. ఇక ఇక క్లీన్ అండ్ జెర్క్‌లోనూ సత్తా చాటుతూ 113 కేజీలు ఎత్తింది. మొత్తం స్కోర్ 206 కేజీలు నమోదు చేసిన ఒనోమోల గోల్డ్ మెడల్ పట్టేసింది.

# రాజా ముత్తుపాండికి రజతం



కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత వెయిట్‌లిఫ్టర్లు తమ సత్తా చాటుతున్నారు. ఆదివారం జరిగిన పురుషుల 65 కేజీల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకం సాధించాడు. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి 286 కేజీలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. దీంతో గ్లాస్గోలో భారత్‌కు ఆ రోజే వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడో పతకం లభించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల రాజా ముత్తుపాండి స్నాచ్‌లో 126 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 160 కేజీలు విజయవంతంగా ఎత్తాడు. రెండు విభాగాల్లో కలిపి 286 కేజీల మొత్తం బరువుతో రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిడిన్ మహ్మద్ మొత్తం 299 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకున్న ఘనత కూడా అతని ఖాతాలో చేరింది. రాజా ముత్తుపాండి విజయానికి వెనక సుదీర్ఘ పోరాటం ఉంది. 2019లో మోచేతి లిగమెంట్‌కు తీవ్రమైన గాయం కావడంతో అతని కెరీర్ సంక్షోభంలో పడింది. అనంతరం కరోనా మహమ్మారి కారణంగా పునరావాస ప్రక్రియ కూడా దెబ్బతింది. అంతేకాకుండా కొత్త బరువు విభాగాలకు మార్పు, భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ జెరెమీ లాల్‌రిన్నుంగా ఎదుగుదలతో 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు ఎంపిక కాలేకపోయాడు. అయితే 65 కేజీల విభాగం ప్రవేశపెట్టిన తర్వాత మళ్లీ జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. 2025 ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా 299 కేజీలు ఎత్తి తొమ్మిదో స్థానంలో నిలవడం అతనికి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇప్పుడు అదే జోరును కొనసాగిస్తూ కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ విజయాన్ని తల్లిదండ్రులు, కోచ్ విజయ్ శర్మకు అంకితం చేస్తానని రాజా ముత్తుపాండి తెలిపాడు. అయితే స్వర్ణ పతకాన్ని అందుకోలేకపోవడం తనకు నిరాశ కలిగించిందని తెలిపాడు. కోచ్ తనపై పూర్తి విశ్వాసం ఉంచారని, కానీ ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేకపోయానని అన్నాడు. అయితే ఈ పోటీ నుంచి నేర్చుకున్న పాఠాలతో మరింత కష్టపడి శిక్షణ తీసుకుని భవిష్యత్తులో స్వర్ణం సాధించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశాడు. ఆదివారం భారత పతకాల ఖాతాలో చేరిన మూడు పతకాలు కూడా వెయిట్‌లిఫ్టింగ్ నుంచే రావడం విశేషం. అంతకుముందు మహిళల 48 కేజీల విభాగంలో ఒలింపిక్ రజత పతక విజేత మీరాబాయి చాను వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అలాగే పురుషుల 60 కేజీల విభాగంలో చనాంబం రిషికాంతా సింగ్ రజత పతకం సాధించి భారత్‌కు మరో విజయాన్ని అందించాడు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ మరోసారి భారత పతకాల వేటలో కీలక పాత్ర పోషించింది.మరోవైపు బాక్సింగ్‌లో భారత్‌కు తొలి నిరాశ ఎదురైంది. పురుషుల విభాగంలో పోటీపడిన ఆదిత్య ప్రతాప్ యాదవ్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ఉగాండాకు చెందిన నుహు బట్టే చేతిలో 3-2 తేడాతో ఓడిపోయాడు. దీంతో గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సింగ్ జట్టుకు తొలి ఓటమి నమోదైంది.




# ఇషా సింగ్ పసిడి గురి

- మను భాకర్‌కు కాంస్య పతకం
- ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

హాంగ్జౌ (చైనా) : భారత స్టార్ షూటర్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ మరోసారి పసిడి గురితో మెరిసింది. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో ఇషా సింగ్ బంగారు పతకం సాధించింది. ఇటీవల మ్యూనిచ్‌లో జరిగిన ప్రపంచకప్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పిన ఇషా సింగ్ అదే జోరులో మరో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. సోమవారం జరిగిన మహిళల 25మీటర్ల పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ 40 హిట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. చైనా షూటర్ జాంగ్ 37 హిట్స్‌తో రెండో స్థానంలో నిలువగా.. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ 28 హిట్స్‌తో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఒకే ఈవెంట్‌లో రెండు పతకాలు రావటంతో హాంగ్జౌ ప్రపంచకప్‌లో భారత్ పతకాల సంఖ్య 3కు చేరుకుంది. భారత్ ఓ పసిడి, ఓ రజతం సహా కాంస్య పతకం దక్కించుకుంది.



# సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.


# ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల




టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

--------

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

# పొలిమేర-3 లో అర్జున్



టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# లావణ్యపై బాడీ షేమింగ్..

## అండగా నిలిచిన మెగా ఫ్యాన్స్



మెగా కుటుంబ కోడలు, నటి లావణ్య త్రిపాఠి తాజాగా బాడీ షేమింగ్‌కు గురయ్యారు. ప్రసవం అనంతరం ఆమె శరీర ఆకృతిలో వచ్చిన మార్పులపై సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు ప్రతికూల వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ ట్రోల్స్‌ను గట్టిగా తిప్పికొడుతూ లావణ్యకు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు.ఇటీవల ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన లావణ్య, మునుపటి కంటే కాస్త బొద్దుగా కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వెలుగులోకి రావడంతో కొందరు నెటిజన్లు ఆమెను లక్ష్యంగా చేసుకుని 'లావుగా అయ్యారు', 'ఆంటీలా కనిపిస్తున్నారు' అంటూ అనుచితంగా వ్యాఖ్యానించారు.

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకున్న లావణ్య, 2025 సెప్టెంబర్‌లో మగబిడ్డ (వాయువ్ తేజ్)కు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ తన సమయాన్ని పూర్తిగా మాతృత్వానికే కేటాయిస్తున్నారు. సాధారణంగా ప్రసవం తర్వాత హార్మోన్ల మార్పుల కారణంగా మహిళల శరీర బరువు పెరగడం అత్యంత సహజమైన విషయం.ఈ నేపథ్యంలో, ఒక నూతన తల్లిపై ఇటువంటి విమర్శలు చేయడం శోచనీయమని మెగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రసవానంతరం మహిళల శరీరంలో మార్పులు రావడం సహజం. గతంలో ఐశ్వర్య రాయ్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర కథానాయికలు కూడా ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. సెలబ్రిటీలైనా, సామాన్యులైనా ప్రసవం తర్వాత తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ బాడీ షేమింగ్ సంస్కృతికి స్వస్తి పలకాలి" అంటూ వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం లావణ్యకు మద్దతుగా మెగా అభిమానులు చేస్తున్న పోస్టులు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.




# 'ఇండియన్ ఐడల్ 16' విన్నర్ జ్యోతిర్మయి నాయక్..!

ప్రముఖ సింగింగ్ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్ 16' విజేతగా ఒడిశాకు చెందిన జ్యోతిర్మయి నాయక్ నిలిచారు. నిన్న అట్టహాసంగా జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో ఆమె రూ. 20 లక్షల నగదు బహుమతిని కూడా గెలుచుకున్నారు. ఫైనల్‌లో తనిష్క్ శుక్లా, అన్షికా చోంకర్, మన్‌రాజ్ వీర్ సింగ్, మైస్కమ్ బోసు, సుహైల్ సూఫీలతో పోటీపడి జ్యోతిర్మయి విజేతగా అవతరించారు. ఇండియన్ ఐడల్ చరిత్రలో ఒడిశా నుంచి టైటిల్ గెలుచుకున్న తొలి కంటెస్టెంట్‌గా ఆమె రికార్డు సృష్టించి, తన రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.

**విజేత ప్రస్థానం..**

ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన 25 ఏళ్ల జ్యోతిర్మయి నాయక్, ఇండియన్ ఐడల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందకముందే ఒడిశా ప్రాంతీయ సంగీత పరిశ్రమలో సుపరిచితురాలు. ఆమె ఒక గాయని మాత్రమే కాదు, శిక్షణ పొందిన మ్యూజిక్ థెరపిస్ట్ కూడా. సంగీతం ద్వారా మానసిక, భావోద్వేగ సమస్యలకు చికిత్స అందించడంలో ఆమెకు నైపుణ్యం ఉంది. 'ఎపిక్ ఆరా లైఫ్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్ కథనం ప్రకారం.. రూర్కెలాలో జన్మించిన జ్యోతిర్మయి తల్లిదండ్రులు చక్రధర్ నాయక్, గౌరీ నాయక్. సంగీతంపై మక్కువ ఉన్న ఆమె తండ్రి, ఆమెను వృత్తిపరంగా ఈ రంగంలో ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.'డెక్కన్ క్రానికల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్యోతిర్మయి తన సంగీత ప్రయాణం గురించి పంచుకున్నారు. మూడో తరగతిలో ఉన్నప్పుడే రూర్కెలాలో బుద్ధ ప్రసాద్ రావు వద్ద హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం ప్రారంభించినట్లు తెలిపారు. భువనేశ్వర్ వెళ్లాక తన ప్రస్తుత గురువు బాలకృష్ణ భైరా వద్ద శిక్షణ కొనసాగించారు. అదే సమయంలో గురు శారదా ప్రసన్న సాహు వద్ద బాలీవుడ్ పాటలపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. "ఆయన 2023లో మరణించినా, ఆయన బోధనలు నన్ను నడిపిస్తూనే ఉన్నాయి. పాటను ఎలా పాడాలో కాదు, భావాలను ఎలా అందంగా పలికించాలో ఆయన నేర్పించారు" అని జ్యోతిర్మయి గుర్తుచేసుకున్నారు.జ్యోతిర్మయి భువనేశ్వర్‌లోని కీట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత చెన్నై స్కూల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీ నుంచి సర్టిఫికేషన్ పొందారు. భవిష్యత్తులో అలియా భట్, దీపికా పదుకొణెలకు ప్లేబ్యాక్ సింగర్‌గా పాడాలనేది తన కల అని ఆమె తెలిపారు. "ఇండియన్ ఐడల్ గెలవడం ఒక కల నిజమైనట్లుగా ఉంది" అని తన ఆనందాన్ని పంచుకున్నారు.



# సూపర్ స్టార్ మనవడి ధీమా..

## నటుడిగానే నా ప్రయాణం అంటున్న జై కృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు తనయుడు జై కృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. నటుడిగా తనను తాను నిరూపించుకుని, ఇండస్ట్రీలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జై కృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాషా తడానీ కథానాయికగా నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్ అధినేత అశ్వినీదత్ సమర్పణలో పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ సినిమాలో ఒక శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.ఈ సందర్భంగా జై కృష్ణ మాట్లాడుతూ, "దర్శకుడు అజయ్ గారు తీర్చిదిద్దిన పాత్రలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. నటుడిగా నా ప్రతిభను చాటుకోవడానికి ఇది ఒక చక్కని కథ. మంచి సినిమాలు చేసే నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన," అని పేర్కొన్నారు.దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, "మహేశ్ బాబు గారి తరహాలోనే జై కృష్ణ కూడా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలిచిపోయే కథానాయకుడు అవుతాడు. సినిమా నేను అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది," అని ధీమా వ్యక్తం చేశారు. నటుడు నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ, కృష్ణ గారి వారసత్వాన్ని జై కృష్ణ ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ, వడ్లమాని శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com